ప్రభాత సూర్య
www.suryaa.news
తెలుగు జాతీయ దిన పత్రిక
వేల రూ.5/ - పేజీలు : 8 సోమవారం 2 జూన్ 2025 సంపుటి: 01, సంచిక : 29
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
96667 32777
ప్రభాత సూర్య
www.suryaa.news

## 10 ఐఈడీ బాంబులను నిర్వీరం చేసిన భద్రతా బలగాలు

**భద్రాచలం:** ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో 10 ఐఈడీ బాంబులను భద్రతా బలగాలు నిర్వీర్యం చేశాయి. పోలీసులను లక్ష్యంగా చేసుకొని మావోయిస్టులు అమర్చిన 10 మందుపాతరలను తొలగించారు. కోహకమేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోడాపారా, గుర్కా అటవీప్రాంతంలో మందుపాతలను గుర్తించిన బలగాలు.. వాటిని వెలికితీశాయి. ఒక్కొక్కటి ఐదు కిలోలకుపైగా బరువు ఉన్నట్లు గుర్తించారు. మావోయిస్టులకు భద్రత బలగాలకు ఎదురుకాల్పులు జరుగుతోన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అడవుల్లోకి కూంబింగ్‌కు వచ్చే భద్రతా బలగాలను హతమార్చుడానికి మావోయిస్టులు దారి పొడవునా ఐఈడీలను అమర్చారు.



## ముస్లిం ఓట్ల కోసమే బుజ్జగింపు రాజకీయాలు

- బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసలను ప్రోత్సహిస్తున్నారు
- బెంగాల్ సీఎం మమతా బెనర్జీపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ధ్వజం
- అసెంబ్లీ ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించేందుకు కృషి చేయాలని

3



## ఈశాన్య రాష్ట్రాల్లో కుంభవృష్టి

- అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, సిక్కిం రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలు జలదిగ్బంధం
- వరదలతో ప్రజలకు తీవ్ర ఇక్కట్లు
- పరిస్థితులపై సీఎంలతో అమిత్ షా సమీక్ష
- అగర్తలలో సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్న జనం

# మంత్రులతో సమాలోచనలు

### ఉద్యోగులు లేవనెత్తిన పలు డిమాండ్లను పరిష్కరించే దిశగా సర్కారు


### రాష్ట్ర ప్రజలకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు



- ఉద్యోగుల సమస్యలు, డీఏలపై కీలక చర్చ
- రిటైర్మెంట్ వయసు ఏడాది పెంపుపై పరిశీలన
- మరింత పకడ్బందీగా రైతుభరోసా అమలు
- సంక్షేమం క్షేత్రస్థాయికి వెళ్లేలా విస్తృత ప్రచారం
- యువవికాసం, భూభారతి, ఇందిరమ్మ ఇళ్లపై చర్చ
- 5న క్యాబినెట్ భేటీ.. అన్నింటిపైనా నిర్ణయం
- ఎన్‌డీఎసఏ నివేదికకు ఓకే.. నిర్మాణ సంస్థపై
- చర్యలకు సిఫారసు చేయనున్న మంత్రివర్గం

సూర్య హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు లేవనెత్తిన పలు డిమాండ్లను పరిష్కరించే దిశగా రేవంత్ సర్కారు యోచిస్తోంది. వారి డిమాండ్లపై ఈ నెల 5న జరిగే మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. ఉద్యోగులకు ఇవ్వాల్సిన డీఏలు, పదవీ విరమణ వయసు పెంపు, సాధారణ బదిలీల అంశాల్లో క్యాబినెట్ భేటీలో కీలక నిర్ణయం తీసుకోనున్నట్టు సమాచారం. ఆదివారం హైదరాబాద్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి.. మంత్రులతో సమావేశమై ఈ మేరకు చర్చించారు. దీంతోపాటు రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు, ఇందిరమ్మ ఇండ్లు, రెవెన్యూ సదస్సులు, వానాకాలం పంటల సాగు సన్నద్ధత, రాజీవ్ యువ వికాసం అంశాలపై మంత్రులు అందించిన నివేదికపై చర్చించారు. ఉద్యోగుల సమస్యలపై నియమించిన కమిటీకి సంబంధించి అధికారులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమా ర్కకు ఇప్పటికే నివేదిక అందించారు. ఆ నివేదికలోని అంశా లతోపాటు ప్రభుత్వ ఉద్యోగుల సంఘాల ప్రతినిధు లతో భేటీ సందర్భంగా వారు ప్రస్తావించిన డిమాండ్లనూ భట్టివి క్రమార్క.. సీఎంకు, మంత్రులకు వివరించారు. దీనిపై ఈ నెల 5న జరిగే క్యాబినెట్ భేటీలో చర్చించాలని, సమ స్యల పరిష్కారంపై ఎలా ముందుకెళ్లాలో నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. కాగా, ప్రభుత్వ ఉద్యోగుల అన్ని డిమాండ్లపై ఒక రోడ్‌మ్యాపను సిద్ధం చేయాలని సర్కారు భావిస్తున్నట్టు తెలిసింది. ఈ విషయంలో ప్రభుత్వం - మిగతా2లో



## ఉత్తరకొరియాగా మార్చొద్దు

### ఇన్‌ఫ్లుయెన్సర్ అరెస్టుపై కంగన

### విడుదల చేయాలి: డచ్ ఎంపీ

3



## స్వేచ్ఛ ఉందని లక్ష్మణ రేఖ దాటొద్దు

- అభిప్రాయాలను అంతర్గతంగానే తెలియజేయాలి
- టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి
- గాంధీభవన్‌లో బాధ్యతలు స్వీకరించిన కమిటీ

సూర్య హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీలో మాట్లాడే స్వేచ్ఛ ఉంటుంది కదా అని నేతలెవరూ లక్ష్మణ రేఖ దాటొద్దని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి స్పష్టం చేశారు. కాంగ్రెస్ అంటేనే ప్రజాస్వామిక వాతావరణం ఉంటుందని.. పార్టీ నాయకులు ఏదైనా మాట్లాడాలనుకుంటే నాలుగు గోడల మధ్య అభిప్రాయాలను తెలియజేయాలని సూచించారు. టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా నియమితులైన తర్వాత తొలిసారి ఢిల్లీ నుంచి రాష్ట్రానికి వచ్చిన మల్లు రవి నేరుగా గాంధీ భవన్‌కు వచ్చి అక్కడ మాజీ చైర్మన్ జి.చిన్నారెడ్డి నుంచి బ్యాధ్యతలు స్వీకరించారు. ఆయనతోపాటు కమిటీ సభ్యులు కూడా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మల్లు రవి మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులెవరూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడరాదన్నారు. క్రమశిక్షణ గీత దాటకుండా పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం - మిగతా2లో



## ప్రచారం కాదు, శత్రువుపై దృష్టిపెట్టండి

- సైన్యానికి పూర్తి స్వేచ్ఛనిచ్చామంటూ గతంలో చెప్పిన ప్రధాని మోదీ ఇప్పుడు అంతా తానే చేశానని చెప్పుకోవడం ఏమిటి
- సొంత గొప్పలు చెప్పుకోవడం మంచిది కాదు : మోదీకి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సలహా

3

# డబుల్ ఇంజన్ సర్కార్ వస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు



- కుటుంబ డ్రామాల్లో.. బీజేపీ పాత్రధారి, సూత్రధారి కాదు
- ఆస్తులు, అధికారం, అవినీతి డబ్బు కోసం బీఆర్ఎస్ పార్టీలో గొడవలు
- కాంగ్రెస్ హయాంలో అవినీతి వికేంద్రీకృతం.. రేవంత్ హామీలేమయ్యాయి?: కిషన్‌రెడ్డి
- బీజేపీలో బీఆర్ఎస్ విలీనంపై ఎప్పుడూ చర్చ జరగలేదు: లక్ష్మణ్

సూర్య హైదరాబాద్

రాష్ట్రంలో రాజకీయ, కుటుంబ డ్రామాలు నడుస్తున్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. కుటుంబ డ్రామాల్లో బీజేపీ పాత్రధారి, సూత్రధారి కాదని స్పష్టం చేశారు. ఆస్తులు, అధికారం, అవినీతి డబ్బుల కోసం బీఆర్ఎసలో గొడవలు జరుగుతున్నాయని, వాటితో బీజేపీకి సంబంధం లేదని అన్నారు. ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలనా విజయాలకు సంబంధించి ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో అవినీతి కేంద్రీకృతం కాగా, కాంగ్రెస్ హయాంలో వికేంద్రీకృతం అయిందని విమర్శించారు. వందలాది మంది బలిదానంతో తెలంగాణను సాధించుకున్నది కేసీఆర్ కుటుంబం, కాంగ్రెస్ నాయకులు దోచుకోవడానికా..? అని మండిపడ్డారు. - మిగతా2లో



## నేటి నుంచే.. స్లాట్ బుకింగ్

- రాష్ట్రవ్యాప్తంగా అన్నిసబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలుకు శ్రీకారం
- రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్‌సైట్‌లో ఏఐ చాట్‌బాట్ 'మేధ'సేవలు కూడా..
- క్రయవిక్రయదారుల సందేహాల నివృత్తి కోసం ప్రత్యేక వాట్సాప్ నంబర్ ఏర్పాటు
- 82476 23578కు వాట్సాప్ చేస్తే కార్యాలయ లొకేషన్, స్లాట్ బుకింగ్ వేళల సమాచారం పొందే వీలు
- అధికారులతో సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

2

## తెలంగాణ తరహా పర్యాటకాన్ని థాయ్‌లాండ్‌లో ప్రచారం చేస్తా

- టైటిల్ గెలిచా.. ఇక దేశమే ప్రాధాన్యం
- థాయ్‌లాండ్‌లో బలవంతపు వ్యభిచారం జరగడం బాధాకరం
- పోలీసు, సైన్యంలో మగువల నియామకం కోసం ఉద్యమిస్తా
- గెలుస్తానన్న నమ్మకంతోనే 'మిస్ యూనివర్స్' పోటీని వదిలేశా
- మిస్ వరల్డ్ పోటీల్లోకి రాకుండా ఉంటే రాజకీయాల్లో ఉండేదాన్ని

2

# మంత్రులతో సమాలోచనలు

-మొదటిపేజీ తరువాయి

రెండు రకాల ఆలోచనలతో ఉన్నట్టు సమాచారం.

**మరింత ఆర్థిక భారం పడకుండా..**

ఇప్పటికే సర్కారుపై ఆర్థికభారం ఉండడం, దీనికితోడు ఈ ఒక్క ఏడాదే 8వేల మందికి పైగా ఉద్యోగులు రిటైర్ కానుండడంతో.. మరింత భారం పడకుండా ఉద్యోగుల పదవీ విరమణ వయసును ఏడాదిపాటు పెంచితే మంచిదని కొందరు మంత్రులు సూచించినట్లు తెలిసింది. దీంతో పాటు ఉద్యోగుల సాధారణ బదిలీలు చేపట్టడం ప్రభుత్వం మొదటి ఆలోచనగా ఉంది. ఇక రెండోది.. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల డీఏల్లో ఎన్నింటిని ప్రకటించాలనే దానిపై మంత్రివర్గ సమావేశంలో కచ్చితమైన నిర్ణయం తీసుకోనున్నారు. ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలపై క్యాబినెట్ భేటీలో నిర్ణయం తీసుకోవాలనే అంశంపై చర్చించారు. కాగా, సమావేశంలో అన్ని అంశాలపై మాట్లాడుతున్న సమయంలో ప్రభుత్వ పనితీరు, క్షేత్రస్థాయిలో ప్రభుత్వం పట్ల ఉన్న అభిప్రాయాలను కొందరు మంత్రులు ప్రస్తావించినట్లు తెలిసింది. రైతుభరోసా పథకం గ్రామాల్లో లక్షల మందికి అమలవుతోందని, అయితే దీనిని మరింత పకడ్బందీగా అమలు చేస్తే రైతుల్లో ప్రభుత్వం పట్ల మరింత సానుకూల స్పందన వస్తుందని వారు అభిప్రాయపడినట్లు సమాచారం. కాగా, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలన్నింటినీ క్షేత్రస్థాయికి చేరేలా చర్యలు తీసుకోవాలనే అంశంపైనా సమావేశంలో చర్చించారు. గ్రామ గ్రామానికి ఈ పథకాలను తెలిపేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

**5న మంత్రివర్గ సమావేశం..**

5న మంత్రివర్గ సమావేశం నిర్వహించి కీలక అంశాలపై చర్చించాలని మంత్రుల భేటీలో నిర్ణయించారు. గత నెల జిల్లాల్లో పర్యటించిన మంత్రులు.. అధికారులతో నిర్వహించిన సమీక్షలకు సంబంధించి తయారుచేసిన నివేదికలపై ఈ సమావేశంలో చర్చించారు. రాజీవ్ యువ వికాసం పథకానికి ఊహించిన దానికంటే ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయని, అనర్హులకు లబ్ధి చేకూరకుండా చూడాలంటూ ఫిర్యాదులూ వచ్చాయని మంత్రులు.. సీఎం దృష్టికి తీసుకెళ్లారు. పెద్దసంఖ్యలో వచ్చిన దరఖాస్తుల స్క్రీనింగ్ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో పూర్తి స్థాయి పరిశీలన తరువాతే అర్హుల జాబితాలను ప్రకటించాలని నిర్ణయించారు. మరింత లోతుగా విశ్లేషించి లబ్ధిదారులను గుర్తించాలన్నారు. ఈ అంశంపై క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఇక యాసంగిలో పండిన ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను సమర్థంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఇతర మంత్రులు అభినందించారు. రాబోయే వానాకాలం నేపథ్యంలో వ్యవసాయం, నీటిపారుదల ప్రాజెక్టులు, తాగునీటి అవసరాలపైనా చర్చించారు. ప్రధానంగా హైదరాబాద్ నగర ట్రాఫిక్, వర్షాల సమయంలో ప్రబలే వ్యాధుల అంశాలనూ ప్రస్తావించారు. వీటన్నింటిపై రోడ్‌మ్యాప్ రూపొందించాలని నిర్ణయించారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న 'తెలంగాణ రైజింగ్–2047'ను సాధించే దిశగా ముందుకెళ్లాలని, అందుకోసం దానిని ప్రజా ఉద్యమంగా మార్చాలని సమావేశంలో నిర్ణయించినట్టు సీఎం కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

**ఎన్‌డీఎస్ఏ నివేదికకు ఆమోదం..**

కాళేశ్వరం, దానిపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అ?థారిటీ (ఎన్‌డీఎస్ఏ) ఇచ్చిన రిపోర్టుపై సీఎం, మంత్రుల సమావేశంలో చర్చించారు. ఈ నెల 5న జరగనున్న క్యాబినెట్ భేటీలో ఎన్‌డీఎస్ఏ నివేదికను ఆమోదించాలని నిర్ణయించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. నిర్మాణ సంస్థపై చర్యలకు సిఫారసు చేయాలనే అంశంపైనా చర్చ జరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ పార్టీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని నిర్ణయించిన నేపథ్యంలో.. ఆ అంశంపైనా చర్చించారు. ఇక బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ తరఫున నిరసన గళం బలంగా వినిపించాలని కూడా నిర్ణయించినట్టు తెలిసింది. ఏపీ, తెలంగాణ నీటి కేటాయింపుల విషయంలో రాజీ పడాల్సిన అవసరం లేదని, రాష్ట్ర రాజకీయాల్లో ఇది చాలా సున్నితమైన అంశమని అభిప్రాయపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కూడా సమావేశంలో చర్చకు వచ్చింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావు ఈ నెల 5న విచారణకు హాజరు కానున్న నేపథ్యంలో.. ఆ తరువాత జరిగే పరిణామాలపైనా చర్చ జరిగినట్లు తెలిసింది. కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఇటీవల ఎమ్మెల్యేలు, మంత్రులతో పాటు ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయాలు తీసుకుంటున్న క్రమంలో ఆ అంశంపైనా చర్చించారు. అనంతరం బీఆర్ఎస్‌లో పరిణామాలు, కవిత కొత్త కార్యాలయం ప్రారంభంపై మాట్లాడుకున్నట్టు సమాచారం. ఈ సందర్భంగా బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేననే అభిప్రాయం ప్రజల్లోకి బలంగా వెళ్లిందని అభిప్రాయపడ్డట్టు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలు వస్తాయని మరికొందరు మంత్రులు అన్నట్లు సమాచారం.

**సీఎంను కలిసిన మందకృష్ణ**

సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం జూబ్లీహిల్స్ నివాసంలో సీఎంను కలిసి ఆయనతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మందకృష్ణకు సీఎం శాలువా కప్పి సన్మానించారు. రాష్ట్రపతి నుంచి పద్మశ్రీ అవార్డును అందుకున్న ఆయన్ను సీఎం అభినందించారు. కాగా, ఉమ్మడి రాష్ట్ర తొలి సీఎం నీలం సంజీవరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీఎం నివాళులర్పించారు.

**రాష్ట్ర ప్రజలకు ఆవిర్భావ శుభాకాంక్షలు: సీఎం రేవంత్**

తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలు జరుపుకొంటున్న సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు కలిసికట్టుగా పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం పదకొండేళ్లు పూర్తి చేసుకుని పన్నెండో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా రాష్ట్ర సాధన పోరాటంలో ప్రాణాలర్పించిన అమరుల త్యాగాలను సీఎం స్మరించుకున్నారు. ఉద్యమంలో పాలుపంచుకున్న కవులు, కళాకారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, మేధావులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, కార్మికులు, కర్షకులు, మహిళలు, రాజకీయ నాయకులందరికీ అభినందనలు తెలిపారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ రైజింగ్ నినాదంతో రాష్ట్ర ఆర్థిక వృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందన్నారు. అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచేలా సరికొత్త విధానాలతో.. భవిష్యత్తు ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. మేరకు సీఎంవో ఒక ప్రకటన విడుదల చేసింది. ఇదిలా ఉండగా.. మంత్రివర్గ విస్తరణ, పీసీసీ కార్యవర్గాల ఖరారుపై ఏఐసీసీతో మాట్లాడేందుకు త్వరలో సీఎం రేవంత్ ఢిల్లీ వెళ్లనున్నారు.

# నేటి నుంచే స్లాట్ బుకింగ్

హైదరాబాద్

రాష్ట్రంలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సోమవారం నుంచి స్లాట్ బుకింగ్ విధానం అమల్లోకి రానుంది. స్లాట్‌బుకింగ్‌తోపాటు కృత్రిమ మేధ (ఏఐ) సహకారంతో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్‌సైట్‌లో చాట్‌బాట్ 'మేధ'సేవలు కూడా ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులతో ఆదివారం నిర్వహించిన సమీక్షలో ఆదేశాలు జారీ చేశారు. వాస్తవానికి స్లాట్ బుకింగ్ విధానాన్ని ఇప్పటికే రెండు దశల్లో పైలట్ ప్రాజెక్టు పద్ధతిన అమలు చేశారు. తొలిదశలో ఏప్రిల్ 10 నుంచి 22 మధ్య, రెండో దశలో మే 12 నుంచి 25 దాకా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఈ విధానం ద్వారా ఇప్పటివరకు 45,191 డాక్యుమెంట్లు రిజిస్టర్ అయ్యాయని.. మాన్యువల్ విధానంతో పోలిస్తే సుమారు 3 వేల వరకు ఎక్కువ రిజిస్ట్రేషన్లు జరిగాయని సమీక్షలో అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రజలకు సులభతరమైన సేవలను పారదర్శకంగా అందించడమే లక్ష్యంగా సోమవారం నుంచి రాష్ట్రంలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేయాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. అయితే స్లాట్ బుకింగ్‌తోపాటు ప్రతి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఐదు మాన్యువల్ రిజిస్ట్రేషన్లు చేసే విధానం కూడా కొనసాగనుంది.

**వాట్సాప్‌లోనే సమాధానాలు**

ఆస్తుల క్రయవిక్రయదారులు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్‌సైట్ ద్వారా నేరుగా సందేహాలు నివృతి చేసుకొనేందుకు 82476 23578 అనే నంబర్‌కు వాట్సాప్‌లో సందేహాలు పంపితే వెంటనే సమాధానాలు వచ్చేలా ఏర్పాట్లు పూర్తయ్యాయి. అలాగే సంబంధిత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల లొకేషన్, స్లాట్ బుకింగ్ ఖాళీల వివరాలు, అందుబాటులో ఉండే సమయం, డీడ్‌లవారీగా రిజిస్ట్రేషన్ చార్జీలు, మార్కెట్ విలువలను కూడా నేరుగా క్రయవిక్రయదారుల సెల్‌ఫోన్లకు పంపేలా అధికారులు సాఫ్ట్‌వేర్ రూపొందించారు. ఐదు వాకిన్ రిజిస్ట్రేషన్లు కూడా..: మంత్రి పొంగులేటి సమీక్ష అనంతరం మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ క్రయవిక్రయదారుల సమయాన్ని ఆదా చేయడంతోపాటు వారికి అవినీతిరహిత పారదర్శక సేవలందించడమే లక్ష్యంగా స్లాట్ బుకింగ్ విధానాన్ని అమల్లోకి తెచ్చామన్నారు. పైలట్ పద్ధతిలో ఈ విధానం ద్వారా రిజిస్ట్రేషన్లు చేసుకున్న వారిలో 94 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేసినందున రాష్ట్రవ్యాప్తంగా స్లాట్ బుకింగ్‌ను అమలు చేస్తున్నామని చెప్పారు. ఈ విధానం అమలు దృష్ట్యా పనిభారం అధికంగా ఉన్న 9 కార్యాలయాల్లో సబ్‌రిజిస్ట్రార్ సహా అదనపు సిబ్బందిని నియమించామని చెప్పారు.

ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు (మధ్యాహ్న భోజన సమయంలో మినహా) ప్రజలు స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చని.. ప్రతి కార్యాలయంలో రోజుకు 48 స్లాట్‌లు అందుబాటులో ఉంటాయని చెప్పారు. అత్యవసర సందర్భాల్లో నేరుగా రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి వీలుగా సాయంత్రం 5 గంటల నుంచి 5:30 గంటల మధ్య 5 వాకిన్ రిజిస్ట్రేషన్లకు అనుమతినిస్తామన్నారు. స్లాట్ బుకింగ్ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి తెస్తున్నందున ఎలాంటి సాంకేతిక సమస్యలు రాకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామని పొంగులేటి పేర్కొన్నారు.

**త్వరలోనే ఈ-ఆధార్..**

రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేసేలా త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఈ%-%ఆధార్‌ను కూడా తీసుకొస్తామని.. అక్రమ రిజిస్ట్రేషన్లు జరగకుండా త్వరలోనే డెవలపర్ రిజిస్ట్రేషన్ మాడ్యూల్‌ను అందుబాటులోకి తెస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. లేఅవుట్లవారీగా రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్ల వివరాలు ఎరుపు రంగులో కనిపించేలా మాడ్యూల్‌ను రూపొందిస్తున్నామని మంత్రి పొంగులేటి వెల్లడించారు.

# వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కు తీసుకోవాలి

కవాడిగూడ

కేంద్ర ప్రభు త్వం ఇటీవల తీసుకు వచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని వెంటనే వెనక్కి తీసుకోవా లని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డు సవరణ చట్టం 2025ని వెనక్కి తీసుకోవాలని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్‌లా బోర్డు ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్కు వద్ద పెద్ద ఎత్తున ధర్నా, భారీ సభ నిర్వహించారు. ఈ సభలో ముఖ్య అతిథిగా ఎంఐఎం శాసన సభా పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ, ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్‌లా బోర్డు అధ్యక్షుడు మౌలానా సయిపుల్లా రహమానీ, ఎంఐఎం ఎమ్మెల్యేలు, పర్సనల్‌లా బోర్డు ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ మత పెద్దలు ఈ ఉద్యమాన్ని ఐక్యంగా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. దీనికి ఎంఐఎం పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని, అదే విధంగా ముస్లిం సంఘాలు, ప్రజా సంఘాలు, మేధావులు కూడా మద్దతు ఇవ్వాలని కోరారు. పర్సనల్‌లా బోర్డు అధ్యక్షుడు మౌలానా సయిపుల్లా రహమానీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తోందని, ముస్లింల వ్యక్తిగత



హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దళితులు, ఆదివాసీలు, ముస్లిం మైనార్టీలపై దాడులు పెరిగిపోయాయని ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో అన్ని వర్గాల ప్రజలు ఏకతాటిపైకి వచ్చి కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొన్నారు.

## స్వేచ్ఛ ఉందని లక్ష్మణ రేఖ దాటొద్దు

-మొదటిపేజీ తరువాయి

పరిధవిల్లేలా చూడాలని కోరారు. తాను మూడు సార్లు ఎంపీగా, ఓసారి ఎమ్మెల్యేగా, రెండుసార్లు ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధిగా బాధ్యతలు నిర్వర్తించానని.. పార్టీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ పదవి రావడం తనకు సంతోషాన్ని ఇచ్చిందని చెప్పారు. ఈ అవకాశం ఇచ్చిన ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

**రాష్ట్రంలో సామాజిక న్యాయమే లక్ష్యంగా పాలన**

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో సామాజిక న్యాయమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో పాలన కొనసాగుతోందని మల్లు రవి తెలిపారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో గత ప్రభుత్వాలు దోపిడీ చేశాయని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయమే లక్ష్యంగా పలు పథకాలు, కార్యక్రమాలను చేపట్టిందని పేర్కొన్నారు. ఆదివారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఏడాదిన్నరకాలంలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ ఆశయాలకు అనుగుణంగా, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు.

## డబుల్ ఇంజన్ సర్కార్ వస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు

-మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్, కాంగ్రెస్ తెలంగాణను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టాయని ఆరోపించారు. ఈ రెండు ప్రభుత్వాల వైఖరి వల్ల రూ.10లక్షల కోట్ల అప్పు అయిందని, ఒక్క సింగరేణికే సర్కారు రూ.42వేల కోట్లు బాకీ ఉందని పేర్కొన్నారు. పాల నా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు సీఎం రేవంత్ పాకిస్థాన్‌తో యుద్ధం గురించి మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన హామీల అమలు ఏమైందో రేవంత్ మాట్లాడరని మండిపడ్డారు. తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ వస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని స్పష్టం చేశారు. 11 ఏళ్ల మోదీ పాలనలో చేపట్టిన కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకువెళ్లాలని పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అవినీతి, కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కిషన్‌రెడ్డి ఈ సందర్భంగా సూచించారు.

**బీఆర్ఎస్‌విలీనంపై కేసీఆర్‌ను అడగాలి: లక్ష్మణ్**

బీజేపీలో బీఆర్ఎస్ విలీన ప్రక్రియ ఎప్పుడూ చర్చకు రాలేదని, విలీనం సంగతిని కేసీఆర్‌నే అడగాలని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. అధికారంలో ఉన్నప్పు డు కాంగ్రెస్ కులగణనపై మాట్లాడలేదని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడే అది గుర్తుకు వస్తుందన్నారు. నిజా మాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం లక్ష్మ ణ్ మీడియాతో మాట్లాడారు. కులగణనపై మోదీ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని చెప్పారు.

**మహేశ్ గౌడ్ కేసీఆర్ కోవర్టు**

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్.. కేసీఆర్ కోవర్టు అని బీజేపీ ఎమ్మెల్యేలు ఆరోపించారు. తమ పార్టీ ఎంపీ ఈటల రాజేందర్ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ఆయన కుట్రలు చేస్తున్నారని పైడి రాకేశ్‌రెడ్డి, పాల్వాయి హరీశ్, ధన్‌పాల్ సూర్యనారాయణ, రామారావు పటేల్ మండిపడ్డారు. కాగా, ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ భరోసా పేరిట కొత్త కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రతీరోజు ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు ఒక ముఖ్య నేత రాష్ట్ర పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. తొలిరోజు సోమవారం ఎంపీ ఈటల ఉంటారు.

## తెలంగాణ తరహా పర్యాటకాన్ని థాయ్‌లాండ్‌లో ప్రచారం చేస్తా

హైదరాబాద్

పర్యాటక ప్రాంతాలను ప్రచారం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం మిస్ వరల్డ్ వంటి గొప్ప కార్యక్రమానికి ఆతిథ్యం ఇచ్చిందని, ఇలాంటి ప్రచారమే థాయ్‌లాండ్‌లో చేయాల్సి ఉందని మిస్ వరల్డ్–2025 ఓపల్ సుచాత షుంగ్‌సిరి అన్నారు. తాను కోరుకున్న టైటిల్ సొంతమైందని, ఇప్పుడు దేశమే తన ప్రాధాన్యమని స్పష్టం చేశారు. థాయ్‌లాండ్‌లో తన సోదరీమణులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు తెలుసని చెప్పారు. ప్రస్తుతం మహిళలకు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్నానని, ఇక నుంచి తన ప్రాధాన్యాలు మరింత పెరగనున్నాయని స్పష్టం చేశారు. స్వదేశానికి వెళ్లిన వెంటనే అక్కడి మహిళల కోసం అనేక కార్యక్రమాలు చేయాల్సి ఉందని తెలిపారు. .

**పర్యాటకులు అందుకే వస్తున్నారు..**

దాదాపు ఏడున్నర కోట్ల జనాభా ఉన్న థాయ్‌లాండ్‌లో మహిళా హక్కుల ఉల్లంఘన నేను గమనించిన అత్యంత అమానవీయ సమస్య. ఒకవైపు అన్ని దేశాల్లో, అన్ని రంగాల్లో మహిళలు పురుషులతో సమానంగా పోటీ పడుతుండగా, మా దేశంలో అలాంటి పరిస్థితి లేదు. అక్కడ సెక్స్ ట్రాఫికింగ్(బలవంతపు వ్యభిచారం) అతిపెద్ద సమస్య. ఉపాధి అవకాశాల్లేక మహిళలు అయిష్టంగానే ఈ వృత్తిలోకి వెళుతున్నారు. అక్కడ 15–25 అమ్మాయిల అక్రమ రవాణా కొన్ని దశాబ్దాలుగా సాగుతోంది. ఐక్యరాజ్య సమితితో సహా అనేక దేశాలు దీన్ని అతిపెద్ద ప్రపంచ సమస్యగా పేర్కొన్నాయి. దీంతో మహిళలు ఎక్కువగా ప్రభావితం అవుతున్నారు. అనేక ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి వెంటనే దృష్టి పెట్టాల్సి ఉంది. బాలికలను బలవంతంగా వ్యభిచార గృహాలకు తరలిస్తున్నారు. మా దేశానికి వచ్చే పర్యాటకులు సైతం అందుకోసమే వస్తున్నారు. వారి ఆలోచన మారాల్సి ఉంది.

**మా దగ్గర మహిళా పోలీసులుండరు..**

హైదరాబాద్ విమానాశ్రయంలో అడుగుపెట్టినప్పటి నుంచి నేను గమనించిన కీలక విషయం పోలీసింగ్. ఇక్కడ పురుషులతో సమానంగా మహిళలున్నారు. 25 రోజులుగా నాకు భద్రతగా మహిళలే ఉండటం చాలా సంతోషం. థాయ్‌లాండ్‌లో ఇలాంటి పరిస్థితి లేదు. అక్కడ మహిళలకు సమాన హక్కులు లేవు. 1997 రాజ్యాంగంలో మహిళలకు తొలిసారి సమాన హక్కులు లభించాయి. దీనిని 2007 రాజ్యాంగంలో తిరిగి ధ్రువీకరించారు. అయినా ఇప్పటికీ పోలీసు, మిలిటరీలో మహిళలకు అవకాశం లేదు. మహిళలు అలాంటి పనులు చేయలేరన్నది ప్రభుత్వ భావన. ఇతర రంగాల్లో మహిళలు నామమాత్రంగా ఉన్నా.. అక్కడి కార్యాలయాల్లో పురుషులదే ఆధిపత్యం. భర్తల చేతుల్లో గృహ హింస ఎక్కువగా ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించకుండా మహిళా సాధికారత సాధించడం అసాధ్యం. అందుకే మహిళలకు సమాన అవకాశాలు, సమాన హక్కులు రాజ్యాంగానికే పరిమితం కాకుండా.. అమల్లోకి తేవడం కోసం ఉద్యమిస్తా.

**రాజకీయాల్లో మార్పు రావాలి..**

పాఠశాల రోజుల నుంచి రాజకీయాలంటే ఆసక్తి. ఈ పోటీల్లోకి రాకుంటే తప్పకుండా రాజకీయాల్లో ఉండేదాన్ని. ఇప్పుడు రాజకీయ సంస్కరణల కోసం నా విజయాన్ని అవకాశంగా ఉపయోగించుకుంటా. థాయ్‌లాండ్ పార్లమెంటులో మహిళల సంఖ్య ఐదో వంతు కూడా లేదు. మొత్తం సీట్లలో 19.4 శాతం మాత్రమే ఉన్నారు. 50 శాతానికి మించి మహిళా ప్రతినిధులు అనేక దేశాల్లో ఉన్నారు. దేశంలో అనేక మార్పులకు రాజకీయమే కీలకం. అక్కడ మహిళల సంఖ్య పెంచితే మహిళా సమస్యలు వేగంగా పరిష్కారం అవుతాయని నేను నమ్ముతా.

**గెలుస్తానన్న నమ్మకంతోనే వచ్చా..**

గత నాలుగేళ్లలో రెండుసార్లు మిస్ యూనివర్స్‌గా ఎంపికయ్యా. 2022లో మూడో రన్నర్‌పగా నిలవగా.. గతేడాది మొదటి రన్నర్‌పగా నిలిచా. సాధారణంగా మిస్ యూనివర్స్‌లో రెండుసార్లు ప్రయత్నం చేశాక మళ్లీ మిస్ వరల్డ్ కోసం ప్రయత్నించరు. అయితే రెండుసార్లు అవకాశం కోల్పోయినా.. మిస్ వరల్డ్ లాంటి గొప్ప అవకాశం సాధిస్తానన్న నమ్మకం ఉండేది. ఇందులో పాల్గొనాలంటే మిస్ యూనివర్స్ రన్నర్‌పగా గతేడాది లభించిన అవకాశాలన్నీ వదులుకోవాలి. అయినప్పటికీ నేను గెలుస్తానన్న నమ్మకంతోనే ఇక్కడికి వచ్చా. నా ఇంట్లో 16 పిల్లులున్నాయి.

# ముస్లిం ఓట్ల కోసమే బుజ్జగింపు రాజకీయాలు

కోల్‌కతా

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నిప్పులు చెరిగారు. ముస్లిం ఓటు బ్యాంకు కోసం బుజ్జగింపు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కేవలం ముస్లింల ఓట్ల కోసమే ఆపరేషన్ సిందూర్‌ను, వక్ఫ్ సవరణ బిల్లును గుడ్డిగా వ్యతిరేకిస్తున్నారని ధ్వజమెత్తారు. ఆదివారం కోల్‌కతాలో బీజేపీ నేతలు, కార్యకర్తల సమావేశంలో అమిత్ షా ప్రసంగించారు. వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మమతా బెనర్జీ శకం 2026లో ముగుస్తుందని తేల్చిచెప్పారు. ఆపరేషన్ సిందూర్‌ను వ్యతిరేకిస్తున్న ముఖ్యమంత్రికి మహిళలు తగిన గుణపాఠం నేర్పడం ఖాయమని పేర్కొన్నారు. ఉగ్రవాదులను నరేంద్ర మోదీ ప్రభుత్వం అణచివేయడాన్ని మమతా బెనర్జీ భరించలేపోతున్నారని విమర్శించారు. ఓటు బ్యాంక్‌ను కాపాడుకొనేందుకు ఎంతకైనా దిగజారుతున్నారని ఆక్షేపించారు. పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిలో పశ్చిమబెంగాల్ వ్యక్తులు కూడా మరణించారని, అయినప్పటికీ మమతా బెనర్జీ నోరెత్తలేదని తప్పుపట్టారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో జరిగిన హింసాకాండ వెనుక తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వ హస్త ఉందని అమిత్ షా ఆరోపించారు.
రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతోనే బంగ్లాదేశ్ నుంచి



బెంగాల్‌లోకి అక్రమ వలసలు కొనసాగుతున్నాయని చెప్పారు. వసలదార్ల కోసం సరిహద్దులు తెరిచేశారని విమర్శించారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు కేవలం రాష్ట్ర భవిష్యత్తుతోనే కాకుండా.. దేశ భద్రతతో ముడిపడి ఉన్నాయని అమిత్ షా స్పష్టంచేశారు. బంగ్లాదేశ్ నుంచి వలసలను ఆపే సత్తా బీజేపీకి మాత్రమే ఉందని తేల్చిచెప్పారు. ఎన్నికల్లో హింసను ఆశ్రయించకుండా డిపాజిట్లు అయినా తెచ్చుకోలగరా? అని మమతా బెనర్జీకి సవాలు విసిరారు. ఇదిలా ఉండగా, అమిత్ షా ఆరోపణలను తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఆదివారం ఖండించింది. సరిహద్దుల రక్షణ కేంద్ర హోంశాఖ పరిధిలోనే ఉంటుందని గుర్తుచేసింది. బంగ్లాదేశ్ నుంచి వలసదార్లు రాకుండా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించింది.

## పాక్, దుబాయ్‌కు భారతీయుల అక్రమ రవాణా..

# ఆలయంలో సంచలన లేఖ

**ఛండీగఢ్:** హర్యానాలోని ఓ శివాలయంలో దొరికిన సీక్రెట్ లేఖ సంచలనంగా మారింది. సదరు లేఖలో? దాదాపు 100 మంది కిడ్నాప్ చేసినట్టు రాసి పెట్టి ఉండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అనంతరం, రంగంలోకి దిగిన పోలీసులు.. దానిలోని విషయాలను పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తి రాసిన లేఖలో హిస్సార్‌కు చెందిన సుమిత్ గార్గ్ గురించి ప్రస్తావించడం వల్ల పోలీసులు అప్రమత్తమయ్యారు. వెంటనే ఉన్నతాధికారులు ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేశారు. వివరాల ప్రకారం.. హర్యానా హిస్సార్‌లోని రెడ్ స్క్వేర్ మార్కెట్‌లో ఉన్న శివాలయంలో పూజ చేసేందుకు శనివారం ఉదయం పూజారి సురేష్ గుడికి వెళ్లారు. ఆలయ ద్వారాలు తెరిచినప్పుడు గోధుమ రంగు కవరులో ఒక లేఖ కనిపించింది. వెంటనే సురేష్.. దానిని తెరిచి చూశాడు. అందులో ఉన్న మ్యాటర్ చదవడంతో ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యాడు. ఇక, ఆ లేఖపై తెలంగాణలోని నిజామాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి చిరునామా ఉంది. దీంతో పూజారి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అనంతరం, హుటాహుటిన అక్కడికి చేరుకుని పోలీసులు లేఖను స్వాధీనం చేసుకున్నారు. దానిలోని విషయాలను పరిశీలించారు. హిస్సార్, అంబాలా, గురుగ్రామ్, సిర్సా, రేవారి, గంగానగర్, అజ్మీర్, నర్వానా సహా దేశంలోని వివిధ నగరాల నుంచి దాదాపు వంద మందిని గుర్తుతెలియని వ్యక్తి కిడ్నాప్ చేసి దుబాయ్, పాకిస్తాన్‌కు విక్రయించినట్లు లేఖలో ఉంది. దీంతో, షాకైన పోలీసులు.. ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వెంటనే ఉన్నతాధికారులు ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు.



**2018 నుంచే అక్రమ రవాణా..**

లేఖ ప్రకారం.. మేము 2018 నుంచి ఈ అక్రమ రవాణా ప్రారంభించాం. నేను నా పేరును వెల్లడించను. ఫతేహాబాద్‌కు చెందిన ఒక కుటుంబం మాకు సహాయం చేసేది. వారు లక్ష్యాలను ఎంచుకుని ప్రేమ లేదా డబ్బు లావాదేవీల ద్వారా ప్రజలను వలలో వేసుకునేవారు. హిస్సార్‌కు చెందిన సుమిత్ గార్గ్, అంబాలా వాసి దిగ్విజయ్, నర్వానాకు చెందిన నవీన్ రోహిలా, గురుగ్రామ్ వాసి అమర్?నాథ్, ఎల్లనాబాద్‌కు చెందిన వినోద్ కుమార్, అమిత్ బాగ్రి, రేవారీకి చెందిన అన్షు గులాటి, గంగానగర్?కు చెందిన రోహిణి, సన్నీ, అజ్మీర్?కు చెందిన అంకిత్ శర్మ, సిర్సాకు చెందిన అనూజ్, యాజ్‌పుర్‌కు చెందిన నరేష్?ను వేరే దేశాలకు అక్రమ రవాణా చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో ఒకరు పాకిస్థాన్ నుంచి పారి పోయారని కూడా చెప్పారు. మహిళా ముఠా నాయకురాలు పారిపోయిన యువకుడిని పట్టుకుని చంపమని లేదా అతని కుటుంబం నుంచి ఒక వ్యక్తిని కిడ్నాప్ చేయమని బెదిరిస్తోందన్నారు. ఆమె తన కుటుంబానికి హాని చేస్తానని బెదిరిస్తోందని, అందుకే భయపడి ఈ లేఖ రాస్తున్నానని పేర్కొన్నారు.

**సుమిత్ ఎవరు?.**

గుర్తు తెలియని వ్యక్తి రాసిన లేఖలో హిస్సార్?కు చెందిన సుమిత్ గార్గ్ గురించి ప్రస్తావించడం వల్ల పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇదే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హిస్సార్ లో సుమిత్ అనే పేరు ఉన్న నాలుగైదు మంది కనిపించకుండా పోయినట్లు తేలింది. వారిలో ఎవరు అక్రమ రవాణాకు గురయ్యారో తెలుసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో వారి కుటుంబాలను సంప్రదించారు. అలాగే అక్రమ రవాణాకు సాయం చేసిన ఫతేహాబాద్ కు చెందిన కుటుంబం కోసం పోలీసులు వెతకడం ప్రారంభించారు.

**పోలీసుల తనిఖీలు..**

పాకిస్థాన్, దుబాయ్ వంటి ప్రదేశాలకు భారతీయుల అక్రమ రవాణా జరుగుతుందని ప్రస్తావించడం వల్ల దర్యాప్తు సంస్థలు ఈ లేఖను తీవ్రంగా పరిగణిస్తున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో దర్యాప్తు చేపట్టడానికి హర్యానా పోలీసులు కేంద్ర సంస్థలను సంప్రదించారు. అదే సమయంలో లేఖలో పేర్కొన్న వ్యక్తుల అదృశ్యాన్ని ధ్రువీకరించడానికి వారి కుటుంబాలను సంప్రదిస్తున్నారు. మానవ అక్రమ రవాణా గురించి లెటర్ వైరల్ కావడం వల్ల హిస్సార్, దాని పరిసర ప్రాంత ప్రజల్లో భయాందోళన నెలకొంది.

## 10 ఐఈడీ బాంబులను నిర్వీరం చేసిన భద్రతా బలగాలు

**భద్రాచలం:** ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో 10 ఐఈడీ బాంబులను భద్రతా బలగాలు నిర్వీర్యం చేశాయి. పోలీసులను లక్ష్యంగా చేసుకొని మావోయిస్టులు అమర్చిన 10 మందుపాతరలను తొలగించారు. కోహకమేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోడాపారా, గుర్కా అటవీప్రాంతంలో మందుపాతలను గుర్తించిన బలగాలు.. వాటిని వెలికితీశాయి. ఒక్కొక్కటి ఐదు కిలోలకుపైగా బరువు ఉన్నట్లు గుర్తించారు. మావోయిస్టులకు భద్రత బలగాలకు ఎదురుకాల్పులు జరుగుతోన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అడవుల్లోకి కూంబింగ్‌కు వచ్చే భద్రతా బలగాలను హతమార్చడానికి మావోయిస్టులు దారి పొడవునా ఐఈడీలను అమర్చారు. ఈ నేపథ్యంలో భద్రతా బలగాలు కూంబింగ్ వెళ్తూ మందుపాతలను గుర్తించి నిర్వీర్యం చేశాయి.

# దేశంలో విజృంభిస్తున్న కోవిడ్

ఢిల్లీ: దేశంలో కరోనా కేసులు అంతకంతకూ పెరుగుతున్నట్లు కేంద్ర ఆరోగ్య శాఖ విడుదల చేసిన గణాంకాలు చెబుతున్నాయి. ఆ గణాంకాల ఆధారంగా గడిచిన వారంలో కోవిడ్-19 కేసులు 1200 శాతం పెరిగినట్లు తెలుస్తోంది. ఆదివారం కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా సమాచారం ప్రకారం, దేశవ్యాప్తంగా 3,758 యాక్టివ్ కేసులు నమోదయ్యాయి. గత 24 గంటల్లో 363 కొత్త కేసులు నమోదు కాగా.. కోవిడ్-19తో నలుగురు మరణించారు. ఈ మరణాల్లో ఒక్కోటి కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో ఉండగా మిగతా రెండు పశ్చిమ బెంగాల్‌లో నమోదయ్యాయి. ప్రస్తుతం కోవిడ్-19 కేసులు అత్యధికంగా నమోదవుతున్న రాష్ట్రాల్లో కేరళ. ఈ రాష్ట్రంలో 1,400 కోవిడ్-19 యాక్టివ్ కేసులు ఉన్నాయి. తర్వాత మహారాష్ట్ర (485), ఢిల్లీ (436), గుజరాత్ (320), పశ్చిమ బెంగాల్ (287) రాష్ట్రాలు ఉన్నాయి. ఇతర రాష్ట్రాల్లోనూ కేసులు పెరుగుతున్నాయి. కర్ణాటకలో (238), తమిళనాడులో (199), ఉత్తరప్రదేశ్‌లో (149), రాజస్థాన్‌లో (62) యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఇక, గత మే 22న దేశంలో కేవలం 257 యాక్టివ్ కేసులుండగా మే 26న 1,010 కు పెరిగాయి. ఈ సంఖ్య మే 31నాటికి 3,395కు



చేరింది. దీంతో దేశంలో కోవిడ్ కేసుల నమోదు సంఖ్య పెరుగుతున్నట్లు కేంద్రం విడుదల చేసిన నివేదిక హైలెట్ చేసింది. కొత్తగా నమోదైన 363 కేసుల్లో పశ్చిమ బెంగాల్‌లో 82, కేరళలో 64, ఢిల్లీలో 61, గుజరాత్‌లో 55 కేసులు ఉన్నాయి. ఈ సందర్భంగా ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బెహల్ మాట్లాడుతూ.. దేశంలో కోవిడ్-19 బాధితుల్లో ఒమిక్రాన్ సబ్‌వేరియంట్లు ఉన్నాయి. ఈ నాలుగు సబ్‌వేరియంట్లు %ఖీ.7, ఔఖీ+, జీచీ.1, చీదీ%.1.8.1. పశ్చిమ, దక్షిణ భారత్‌లో ఎక్కువగా కనపడుతున్నాయి. కానీ భయపడాల్సిన అవసరం లేదు' అని చెప్పారు.

## ఈశాన్య రాష్ట్రాల్లో కుంభవృష్టి

గువాహటి/రంగియా/జోర్‌హాట్

నైరుతి రుతుపవనాల కారణంగా ఈశాన్య రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో వరదల బీభత్సం కొనసాగుతోంది. అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, మణిపుర్, సిక్కిం రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలు జలదిగ్బంధమయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు పలుచోట్ల కొండచరియలు విరిగిపడటంతో వందల సంఖ్యలో ఇళ్లు దెబ్బతిన్నాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదివారం అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల ముఖ్యమంత్రులు హిమంత బిశ్వ శర్మ, పెమా ఖండూ, ప్రేమ్ సింగ్ తమాంగ్, మణిపుర్ గవర్నర్ అజయ్ కుమార్ భల్లాలతో ఫోన్‌లో మాట్లాడి వరద పరిస్థితులపై ఆరా తీశారు. సహాయక చర్యల విషయంలో కేంద్రం నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని భరోసా కల్పించారు. అస్సాంలో ఆదివారం 7 ప్రధాన నదులు ప్రమాదకర స్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. 20కి పైగా జిల్లాల్లో వరద జలాలతో సుమారు 4 లక్షల మంది ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గువాహటిలో శనివారం 24 గంటల్లోనే 11 సెంటీ మీటర్లకుపైగా వర్షపాతం నమోదైంది. గత 67 ఏళ్లలో మే నెలలో ఒక్కరోజులో నమోదైన అత్యధిక వర్షపాతం ఇదే కావడం గమనార్హం. రాష్ట్రంలో వరదలతోపాటు కొండచరియలు విరిగిపడుతున్న కారణంగా రహదారులు, రైలు మార్గాల్లో ప్రయాణాలు, బోట్ల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఈ రాష్ట్రంలో మృతుల సంఖ్య 10కి చేరింది. మణిపుర్‌లో ఎడతెరిపి లేని వర్షాలు, విరిగిపడుతున్న కొండచరియలతో గత 48 గంటల్లో 883 ఇళ్లు దెబ్బతిన్నాయి. వరద జలాలతో 3,800 మందికిపైగా ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. తూర్పు ఇంఫాల్ జిల్లాలో వరదల్లో చిక్కుకున్న సుమారు 800 మందిని రక్షించారు. అస్సాం-అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దులో ఉద్ధృతంగా ప్రవహిస్తున్న బోమ్‌జీర్ నదిలో చిక్కుకున్న 14 మందిని భారత వాయుసేన సిబ్బంది కాపాడారు. త్రిపుర రాజధాని అగర్తలలో ఎడతెగని వర్షంతో ఓ వ్యక్తి మ్యాన్‌హోల్‌లో పడి చనిపోయాడు. మూడు గంటల వ్యవధిలోనే 20 సెం.మీ.ల రికార్డు వర్షపాతం నమోదైనట్లు అధికారులు ఆదివారం తెలిపారు. అగర్తలలోని 27 సహాయ శిబిరాల్లో 5000 మందికి పైగా నగరవాసులు తలదాచుకుంటున్నారు. పశ్చిమ త్రిపుర జిల్లాలో 1300 కుటుంబాలు శిబిరాల్లో ఆశ్రయం పొందాయి. హావ్‌డా నది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోందని, నది సమీపంలో నివసిస్తున్న 5,765 కుటుంబాలకు సహాయ శిబిరాల్లో ఆశ్రయం కల్పించినట్లు అధికారులు తెలిపారు.

## ప్రచారం కాదు, శత్రువుపై దృష్టిపెట్టండి

బెంగళూరు



ఆపరేషన్ సిందూర్ తర్వాత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభల్లో చేస్తున్న ప్రసంగాలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే స్పందించారు. ప్రస్తుతం ఎన్నికల ప్రచారాలకు ప్రధాని దూరంగా ఉంటూ శత్రువుపై దృష్టిసారించాలని సూచించారు.బెంగళూరులో ఆదివారంనాడు మీడియాతో ఖర్గే మాట్లాడుతూ, ఆయన (మోదీ) ఇచ్చే ప్రతి ప్రకటనకు తాను స్పందించాలని అనుకోవడం లేదని చెప్పారు. అయితే ఇటీవల ఆయన ఇస్తున్న బహిరంగ ప్రకటనలు, రాజకీయాల కార్యకాలాపాలను దృష్టిలో ఉంచుకుని తాను ఒక సూచన చేస్తున్నానని అన్నారు. ప్రస్తుతానికి కొంతకాలం ఆయన ఎన్నికల ప్రచారాలకు దూరంగా ఉంటూ దేశంపై దృష్టి సారించాలని అన్నారు. సైన్యానికి పూర్తి స్వేచ్ఛనిచ్చామంటూ గతంలో చెప్పిన ప్రధాని మోదీ ఇప్పుడు అంతా తానే చేశానని చెప్పుకోవడం ఏమిటని ప్రశ్నించారు. సొంత గొప్పలు చెప్పుకోవడం మంచిది కాదన్నారు. దానికి బదులుగా శత్రువుపై దృష్టి సారించాలని సూచించారు. సాయుధ బలగాలకు తమ పూర్తి సహకారం ఉంటుందని ఖర్గే చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన తాజా పరిణామాలపై మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రతినిధి బృందం కన్సల్టేషన్స్ కోసం విదేశాలకు వెళ్లిందని చెప్పారు. వాళ్లు వచ్చేంత వరకూ ఆ వివరాలు మాట్లాడటం సరికాదని అన్నారు.

## ఉత్తరకొరియాగా మార్చొద్దు

న్యూఢిల్లీ

సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ షర్మిష్ట పనోలీ అరెస్టును బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ తీవ్రంగా తప్పుబట్టారు. ఆపరేషన్ సిందూర్‌పై కొందరు బాలీవుడ్ స్టార్లు ఎందుకు పెదవి విప్పలేదంటూ ఎక్స్‌లో వివాదాస్పద పోస్ట్ చేసినందుకు పనోలీని కోల్‌కతా పోలీసులు అరెస్టు చేయడం, కోర్టు ఆమెకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడం తెలిసిందే. పనోలీ వాడిన భాష అభ్యంతకరమే అయినా అందుకామె క్షమాపణలు చెప్పారని కంగన గుర్తు చేశారు.
కనుక ఆమెను విడుదల చేసి దీన్ని ఇంతటితో వదిలేయాలని పశ్చిమబెంగాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగాక మరింతగా కక్షసాధింపుకు పాల్పడి రాష్ట్రాన్ని ఉత్తరకొరియాగా మార్చొద్దని సూచించారు. నెదర్లాండ్స్ ఎంపీ గ్రీత్ వైల్డర్స్ కూడా పనోలీ అరెస్టును తప్పుబట్టారు. ఇది భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు గొడ్డలిపెట్టని ఆక్షేపించారు. ఆమె తక్షణ విడుదలకు చర్యలు తీసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు.

## రైలు పట్టాలపై పొడవైన ఐరన్ పైపు.. తర్వాత ఏం జరిగిందంటే?


లక్నో: రైలుకు ప్రమాదం కలిగించేందుకు ముష్కరులు ప్రయత్నించారు. రైలు పట్టాలపై పొడవైన ఐరన్ పైపు, సిమ్మెంట్ పైపు ఉంచారు. లోకోపైలట్స్ సకాలంలో గుర్తించి రైలును నిలిపివేశారు. దీంతో రైలు పట్టాలు తప్పే ప్రమాదం తప్పింది. ఉత్తరప్రదేశ్‌లోని షామ్లి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శనివారం రాత్రి వేళ బల్వా గ్రామం సమీపంలోని రైలు పట్టాలపై పది అడుగుల పొడవైన ఇనుప పైపు, సిమ్మెంట్ పైపును ముష్కరులు ఉంచారు. సహరాన్‌పూర్ నుంచి ఢిల్లీకి వెళ్తున్న ప్యాసింజర్ రైలు లోకోపైలట్స్ సకాలంలో దీనిని గుర్తించారు. ఎమర్జెన్సీ బ్రేకులు వేసి రైలును నిలిపివేశారు. కాగా, రైల్వే అధికారులు, పోలీసులకు ఈ సమచారం ఇచ్చారు. దీంతో వారు అక్కడకు చేరుకున్నారు. రైలు పట్టాలపై ఉంచిన పది అడుగుల పొడవైన ఇనుప పైపు, సిమ్మెంట్ గొట్టాన్ని పరిశీలించారు. రైలు డ్రైవర్ అప్రమత్తత వల్ల ప్రమాదం తప్పిందని పోలీస్ అధికారి తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. బాధ్యులైన వారిని అరెస్ట్ చేస్తామని అన్నారు. మరోవైపు ఈ సంఘటన నేపథ్యంలో ఆ మార్గంలో రైళ్ల రాకపోకలకు కొంతసేపు అంతరాయం ఏర్పడింది. ట్రాక్‌ను క్లియర్ చేసిన తర్వాత రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు. కాగా, ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## మాక్ డ్రిల్ సమయంలో తేనెటీగల దాడి.. పరుగులు తీసిన అధికారులు

**జైపూర్:** రాజస్థాన్‌లోని పాకిస్థాన్ సరిహద్దు జిల్లాలతో పాటు, ఆ రాష్ట్రం అంతటా శనివారం 'ఆపరేషన్ షీల్డ్' పేరుతో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సమయంలో పలువురు అధికారులపై తేనెటీగలు దాడి చేశాయి. దీంతో వారంతా పరుగులు తీశారు. ఈ సంఘటన రియల్ మాక్ డ్రిల్‌ను తలపించింది. ఝలావర్‌లోని కాలిసింధ్ డ్యామ్ వద్ద మాక్ డ్రిల్ సందర్భంగా డ్రోన్ దాడి జరుగుతుందన్న పరిస్థితి నెలకొన్నది. అయితే అదే సమయంలో అక్కడున్న కలెక్టర్, ఎస్పీతో సహా చాలా మంది అధికారులు, ఉద్యోగులపై తేనెటీగలు దాడి చేశాయి. దీంతో వారంతా సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు. కాగా, మాక్ డ్రిల్‌లో భాగంగా రాజస్థాన్ అంతటా శనివారం రాత్రి 8 గంటల నుంచి వేర్వేరు సమయాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. వివిధ నగరాల్లో 15 నిమిషాల నుంచి 25 నిమిషాల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బ్లాక్‌అవుట్ సమయంలో, ప్రజలు తమ ఇళ్ళు, షాపులు, కార్యాలయాల్లో లైట్లు ఆర్పివేశారు.

# ఆకాంక్షకు తగ్గ అభివృద్ధి జరిగిందా

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం జరిగి పదకొండు సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్ర ఆవిర్భావ లక్ష్యం ఏ మేరకు నెరవేరిందన్న మూల్యాంకనం చేయాల్సి ఉంది. రాష్ట్రం కోసం జరిగిన పోరాటం చరిత్రాత్మకమైనది. ఈ పోరాటంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారు. దాదాపు అన్ని రాజకీయ పార్టీలు రాష్ట్రాన్ని ఇవ్వాలనే డిమాండ్ చేశాయి. ఆ రకంగా చూసినప్పుడు తెలంగాణ మలిదశ ఉద్యమం విలక్షణమైనది. ఇటీవలి కాలంలో అత్యంత శాంతియుతంగా జరిగి సజావుగా లక్ష్యాన్ని సాధించిన ఉద్యమం ఇదే. శ్రీకాంతాచారి లాంటి యువకులు ఆత్మబలిదానం చేసుకున్నప్పటికీ హింసకు ఏ మాత్రం తావు లేకుండా జరిగిన ఉద్యమం ఇది. ఆధునిక పోరాటాలకు ఇదొక మోడల్. నిజానికి తెలంగాణ చరిత్ర పోరాటాలమయం. 1945లో సాయుధ పోరాటాన్ని జరపాల్సిన పరిస్థితుల్ని ఎదుర్కొన్నది తెలంగాణ. 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు కూడా ఇక్కడ భావనాత్మక సంఘర్షణ తొణికిసలాడింది. 1948 సెప్టెంబర్ 17 విలీనం%-% ఇక్కడి ప్రజలకు ఒక గుర్తుంచుకోవలసిన రోజు. 1952 దాకా దాదాపు మిలిటరీ పరిపాలనే కొనసాగింది. ఇంకొక ప్రధాన ఘట్టం 1956లో ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావం. తదనంతరం 1957లో ముల్కీ ఉద్యమం కూడా విద్యావంతులను పట్టి కుదిపేసింది. దీని వైఫల్యసాక్ష్యంగా 1969లో 'జై తెలంగాణ' ఈ ప్రాంతాన్ని అట్టుడికేటట్టు చేసింది. 2000 సంవత్సరం నుంచి మొదలైన మలిదశ ఉద్యమం ఈ పోరాటాల మేలిమిని స్వీకరించిందన్నట్టుగా అత్యంత శాంతియుతంగా నడిచి, ఖచ్చితమైన లక్ష్యాన్ని చేరుకొని ఒక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడింది. అయితే తెలంగాణ ఎందుకు ఏర్పడిందో ఆ లక్ష్యసాధన తొవ్వలోనే నడుస్తున్నదా అని ప్రశ్నించుకోవలసిన అవసరం ఉంది. తెలంగాణ రాష్ట్రం వచ్చాక తెలంగాణ భాషకు న్యూనత లేకుండా పోయింది, గౌరవం పెరిగింది. ఏ సినిమాలలో తెలంగాణ భాష చిన్నతనానికి గురైందో, అదే తెలుగు సినిమాలలో తెలంగాణ భాషను హీరోలు కూడా మాట్లాడడం మొదలైంది. తెలంగాణ భాష ఉన్న సినిమాలే హిట్ అవ్వడం కూడా ఎవరూ కాదనలేని సత్యం. తెలంగాణలో ప్రపంచ తెలుగు మహాసభలు ఇక్కడి సాహిత్య వాతావరణాన్ని ఉద్దీపింపజేశాయి. భౌతికపరమైన అభివృద్ధిని కూడా గమనించవలసి ఉంది. హైదరాబాదు, దాని పరిసరాలలో రోడ్లు విస్తరించబడ్డాయి. ఫ్లైఓవర్లు నిర్మించబడ్డాయి. అండర్ పాస్‌లు కొత్తగా తొవ్వబడ్డాయి. ఇరవైనాలుగు గంటలు విద్యుత్ సరఫరా నిరాఘాటంగా జరిగింది. ఇవి కాకుండా ప్రధానంగా తెలంగాణ ఉద్యమం ముందుకు తీసుకు వచ్చిన ఒక నినాదం నీళ్లు, నిధులు, నియామకాలు. ఈ మూడు రంగాలలో ఆశించిన మేరకు అభివృద్ధి జరిగిందా అనే ప్రశ్నకు ఏకవాక్య సమాధానం లేదు. మిషన్ కాకతీయ లాంటి



పథకాల ద్వారా చెరువులను కాలువ నీటితో నింపడం, వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవడం జరిగింది. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి మంచినీటి సరఫరా చేయాలనే ప్రయత్నం కొంతమేరకు సఫలీకృతమైంది. ఈ చిన్న విజయాలను అపహాస్యం చేసే విధంగా కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. ఇక నిధుల విషయానికి వస్తే రాష్ట్రంలోని ఆర్థిక వనరులన్నీ మన రాష్ట్రానికే వాడుకునే సౌకర్యం ఒకటి ఉందని సంతోషపడవచ్చు. కానీ కేవలం రూ.75 వేల కోట్ల అప్పుతో ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రం, ఈ రోజు ఆరు లక్షల 70 వేల కోట్లకి చేరుకుందని తలుచుకున్న ప్రతి విద్యావంతుడు ప్రభుత్వాన్ని తప్పు పట్టాల్సిన పరిస్థితి వచ్చింది. ఆర్థిక అస్తవ్యస్తతను తప్పించుకోవడానికి ఉద్యోగుల విరమణ వయసును 58 నుంచి 61కి పెంచడం ఎవరూ కాదనలేని వాస్తవం. ఇక మూడవ ప్రధాన నినాదం నియామకాలు. సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, వెనుకబడిన తరగతుల, మైనారిటీల గురుకులాలు ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ విద్యను అందించే లక్ష్యంలో భాగంగా ఉపాధ్యాయులను, లెక్చరర్లను కొంతమందిని నియమించారు. నీటిపారుదల శాఖకు కొంతమంది సహాయ ఇంజనీర్లను కూడా నియమించారు. రెవెన్యూ శాఖను గ్రామస్థాయిలో తొలగించడంలో భాగంగా వ్యవసాయ శాఖకు వ్యవసాయ అధికారులను, వ్యవసాయ విస్తరణ అధికారులను కొంతమందిని నియమించారు. కానీ గ్రూపు వన్, టు, త్రీ నియామకాలు ఏవీ చేపట్టకపోవడం నిరుద్యోగ యువతకు అశనిపాతంగా మారింది. ఇప్పుడిప్పుడే గ్రూప్ వన్, టు, ఉద్యోగాలు నియమించే ప్రక్రియలో పురోగతి కనిపిస్తున్నది. ఏ స్థాయిలో ఉద్యమ ఆకాంక్షలు ఉండేవో ఆ స్థాయిలో అభివృద్ధి జరిగింది అని మాత్రం చెప్పలేం. లాభ నష్టాలతోపాటు ప్రత్యేకంగా చెప్పవలసిన ఇబ్బందికరమైన పరిస్థితులు కూడా రాష్ట్ర ఆవిర్భావానంతరమే సృష్టించబడ్డాయి. పది జిల్లాల తెలంగాణను 33 జిల్లాలుగా విభజించడం శాస్త్రీయ దృక్పథంతో చేసిన వికేంద్రీకరణ అనిపించుకుంటుందా అన్నది పెద్ద ప్రశ్న. పది మండలాలు కలిగిన ములుగు లాంటి జిల్లాలు, 30 మండలాలు కలిగిన నల్లగొండ లాంటి జిల్లాలకు ఒకే స్థాయి కలిగిన అధికార యంత్రాంగాన్ని నియమించడం ఎంత మేరకు సబబు? అన్ని జిల్లాలు చేసినప్పుడు వాటికి సరిపడా ఉద్యోగ నియామకాలు చేయలేదు. కేవలం 10 మండలాలు ఉన్న జిల్లాలకు కూడా అదే స్థాయి ఐడీఓసీలను నిర్మించడం ప్రజాధనాన్ని సద్వినియోగపరచడమేనా అనే ప్రశ్న కూడా ఉంది. గ్రామస్థాయి రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా తొలగించడం భవిష్యత్తులో మరిన్ని సమస్యలను తెచ్చే నిర్ణయం. ఇప్పుడు గ్రామానికి రెవెన్యూ రికార్డుల సజీవచిట్టా పహాణి లేదు. వాటిని నిర్వహించే వీఆర్ఓ లేడు. అటు గ్రామాధికారికి ఇటు తహసిల్దార్‌కు సహకరించే గ్రామ సేవకులు కూడా లేరు. ఇంతగా గ్రామ రెవెన్యూ వ్యవస్థను నిర్మూలించడం భారతదేశంలో ఇంకే రాష్ట్రంలోనూ జరగలేదు. దీన్ని పునర్నిర్మించడం కూడా అంత సులభం కాదు. ఇట్లా ఆలోచించినప్పుడు తెలంగాణ పరిపాలన మీద ప్రభుత్వాలు మరింత శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందని చెప్పక తప్పదు.

# ఆర్థిక వ్యవస్థపై అంకెల గారడీ

భారతదేశం 4 ట్రిలియన్ల డాలర్ల జిడిపి మార్క్‌ను దాటి, జపాన్‌ను అధిగమించి ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. ఇది గొప్ప విజయమని వేడుక చేసుకుంటున్నారు. కానీ నిశితంగా పరిశీలిస్తే ఆనందాన్ని తగ్గించే ముఖ్యమైన ఆర్థిక సవాళ్లు వెల్లడవుతాయి. ఈ వృద్ధి చేరిక గురించి ఎన్నో ప్రశ్నలు తలెత్తుతాయి. తక్కువ తలసరి జిడిపి ద్వారా దెబ్బతిన్న మైలురాయి భారతదేశం మొత్తం జిడిపి 1.4 బిలియన్లకు పైగా ఉన్న, అధిక జనాభాను ప్రతిబింబిస్తున్నప్పటికీ, దాని తలసరి జిడిపి వేరే కథను చెబుతుంది. భారతదేశం 2,878 డాలర్ల వద్ద ఉంది. జపాన్ 33,138 డాలర్లు, యుకె 55,000 డాలర్లు కంటే చాలా వెనుకబడి ఉంది. ఈ స్పష్టమైన అసమానత ఆర్థిక వృద్ధి ప్రయోజనాలు సగటు పౌరుడికి చేరడం లేదని, వ్యక్తిగత శ్రేయస్సు కోట్లాది మందికి అందుబాటులో లేదు. రైతాంగం, కార్మికులు, విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగస్థులు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఆర్థికమాంద్యం సంకేతాలు ఇటీవల డేటాని పరిశీలిస్తే ఆందోళనకరమైన చిత్రాన్ని చిత్రీకరిస్తుంది. గృహ పొదుపులు ఫైనాన్షియల్ ఇయర్ 2020లో 11.61 లక్షల కోట్ల నుంచి ఫైనాన్షియల్ ఇయర్ 25లో 6.52 లక్షల కోట్లకు పడిపోయాయి. ఇది తగ్గిన ఆర్థిక భద్రతను సూచిస్తుంది. ఫైనాన్షియల్ ఇయర్ 25 లో బంగారంపై రుణాలు 71% పెరుగుదల చాలా మంది భారతీయులు ప్రాథమిక అవసరాలను తీర్చడానికి ఆస్తులు రద్దు చేస్తున్నారు అని సూచిస్తుంది. వినియోగదారు మార్కెట్ కూడా ఇబ్బందిపడుతున్నాయి. ఫైనాన్షియల్ ఇయర్ 2025లో ఆటో అమ్మకాలు 6% స్వల్పంగా పెరిగాయి. ద్విచక్ర వాహనం, వినియోగ వస్తువులు (ఎఫ్ఎంసిజి) అమ్మకాలలో మందగమనంతోపాటు, బలహీనమైన డిమాండ్‌ను సూచిస్తున్నాయి. ఆర్థిక బాధ, మానవ నష్టం ఈ సవాళ్ల మానవ నష్టం ఆందోళనకరమైనది. ఆర్థిక సంక్షోభం రోజుకు 19 ఆత్మహత్యలతో ముడిపడి ఉంది. ప్రతి గంటకు ఇద్దరు రైతులు తమ ప్రాణాలను బలిగొంటారు. ఈ గణాంకాలు వ్యవసాయంలో లోతుగా పాతుకుపోయిన సమస్యలను విస్తృతమైన ఆర్థిక ఒత్తిడిని సూచిస్తున్నాయి. అప్పు, నిరుద్యోగాన్ని పరిష్కరించడానికి లక్ష్యంగా చేసుకున్న జోక్యాల అవసరాన్ని నొక్కిచెబుతున్నాయి. మధ్యతరగతి పోరాటాలు,




తక్కువ వేతనాలు భారతదేశ మధ్యతరగతి, తరచుగా ఆర్థిక వృద్ధికి ఇంజిన్‌గా పరిగణించబడుతుంది. తీవ్ర ఒత్తిడిలో ఉంది. సగటు మధ్య తరగతి ఆదాయం సంవత్సరానికి రూ. 2.6 లక్షలు (నెలకు రూ. 22,000). ఇది 1820లో వలస రాజ్యాల ముందు భారతదేశంతో పోల్చదగిన స్థాయి. ద్రవ్యోల్బణంతో కలిసిన ఈ స్తబ్దత కొనుగోలు శక్తిని తగ్గించింది. అదనంగా, భారతదేశం సగటు గంట వేతనం ప్రపంచవ్యాప్తంగా ఐదవ అత్యల్ప స్థానంలో ఉంది. ఇది నైపుణ్యం కలిగిన, నైపుణ్యం లేని కార్మికులను తక్కువ ఆదాయ చక్రంలో బంధిస్తుంది. వ్యవస్థాగత సమస్యలు కఠినమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ఆర్థిక కథనం వ్యవస్థాగత సవాళ్లతో మరింత క్లిష్టంగా ఉంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద ఉద్యోగాలకు పెరుగుతున్న డిమాండ్ గ్రామీణ ప్రాంతాల్లో నిరంతర నిరుద్యోగాన్ని సూచిస్తుంది. జనాభాలో దాదాపు 60% మంది 800 మిలియన్లకు పైగా భారతీయులకు ప్రభుత్వం ఉచిత రేషన్ పంపిణీ విస్తృతమైన పేదరికం, ఆహార అభద్రతను హైలైట్ చేస్తుంది. సమగ్ర వృద్ధికి పిలుపు భారతదేశంలో నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడం గర్వకారణం అయినప్పటికీ, జీవన ప్రమాణాలను మెరుగుపరచకపోతే జిడిపి పరిమాణం మాత్రమే ఖాళీ కొలమానం అని నిపుణులు తెలుపుతున్నారు. ప్రజల శ్రేయస్సులో పురోగతికి సరైన అర్థం ఉండాలి. దేశంలో కోట్లాది మంది ప్రాథమిక అవసరాల కోసం పోరాడుతుంటే, దేశం నాలుగవ పెద్ద ఆర్థిక వ్యవస్థ అయింది అని సంబరపడాలా?.విధాన నిర్ణేతలు సమగ్ర వృద్ధిని నిర్ధారించడం, నాణ్యమైన ఉద్యోగాలను సృష్టించడం ఆదాయ అసమానతలను పరిష్కరించడం వంటి సవాలును ఎదుర్కొంటున్నారు. ఈ ప్రయత్నాలు లేకుండా, భారతదేశ ఆర్థిక మైలురాయి దాని పౌరుల వాస్తవాల నుండి డిస్‌కనెక్ట్ చేయబడిన గణాంకాలుగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. ప్రజలకు విద్య, ఆరోగ్యం, ఆహారం, పర్యావరణం, మెరుగైన జీవనం, సాధికారత వైపు అడుగులు వేయకుండా కేవలం అంకెల గారడీ నమ్ముకొని సంబరపడితే తీవ్ర అనర్థాలకు దారితీస్తుంది. వాపును చూసుకొని బలమనుకుంటే అంతే సంగతి.

## అందరికీ అమృతాహారం పాలు

నేడు పాలు లేదా పాల ఉత్పత్తులు వినియోగించని కుటుంబాలు లేవు. భారత్‌లో పాల వాడకం ఓ వారసత్వ సంపదగా, ఆరోగ్య ప్రదాయినిగా, కుటుంబ సభ్యుల అమృతాహారంగా నేటికీ ప్రముఖ స్థానాన్ని పొందింది. పాలను నేరుగా తాగడం, టీ రూపంలో వాడడం, పెరుగు/మజ్జిగ అన్నంలో భాగం కావడం, పాల నుంచి తయారు చేసిన తీపి పదార్థాలను తినడం, పాలతో తయారైన శీతల పానీయాలు వాడడం, నెయ్యి లేదా వెన్న వినియోగించడం సర్వసాధారణంగా కనిపిస్తుంది. వైజ్ఞానిక శాస్త్రం, సుస్థిరాభివృద్ధి, సామాజిక ప్రభావం, డిజిటల్ విప్లవం, ఇన్నొవేషన్, ప్రజారోగ్య విభాగాల ప్రత్యక్ష ప్రభావం పాల ఉత్పత్తుల రంగాలపై పడుతున్నాయి. పాల ఉత్పత్తులు పెరగడంతో భారత్‌లో శ్వేత విప్లవం ఊపందుకుంది. నేడు శ్వేత విప్లవంతో పాటు హరిత, పరిశుభ్రత, భవిష్యత్తుకు అనుకూల అందుగులు పడుతున్నాయి. 1992లో ప్రపంచ పాల ఉత్పత్తి 524 మిలియన్ టన్నులు ఉండగా, 2024లో 979 మిలియన్ టన్నుల వరకు పెరిగింది. కేవలం భారత్‌లోనే 2023 – 24లో పాల ఉత్పత్తి 239.3 మిలియన్ టన్నులుగా నమోదు అవుతూ ప్రపంచంలోనే అత్యధిక పాల ఉత్పత్తి చేసే దేశంగా నిలుస్తున్నది. గత దశాబ్ద కాలంలో భారత్‌లో పాల తలసరి ఉత్పత్తి 48 శాతం పెరగడం గమనించారు. పాలను ఉత్పత్తి చేయడం, డైరీ ఉత్పత్తులను అందుబాటులోకి తేవడం, అన్ని వర్గాల ప్రజలకు, ముఖ్యంగా పేద పిల్లలకు పాలను అందుబాటులోకి తీసుకురావడం నిరంతరం జరగాలి. భారతీయుల భోజనంలో పాల పదార్థాలు ప్రధాన స్థానాన్ని ఆక్రమించాయి.

## ప్రియతమ నాయకుడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన

కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి



**సంస్థాన్ నారాయణపూర్, జూన్ 01( సూర్య ప్రతినిధి )** మునుగోడు నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి మునుగోడు నియోజకవర్గం లోనీ స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ నీ మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేయడం జరిగింది.అనంతరం ఉప్పల లింగస్వామి మాట్లాడుతూ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలి అని మనస్ఫూర్తిగా కోరుకుంటూ రాష్ట్రంలో త్వరలో ఏర్పడే మంత్రివర్గ విస్తరణలో భాగంగా రాజగోపాల్ రెడ్డి కి మంత్రి పదవి ఇవ్వాలని కోరారు.రాజగోపాల్ రెడ్డి కి మంత్రి పదవి ఇస్తే మునుగోడు నియోజకవర్గం మరింత అభివృద్ధి చేకూరుతుంది అని ఆయన అన్నారు. ఏది ఏమైనా తెలంగాణ రాష్ట్రంలో త్వరలో ఏర్పడే మంత్రివర్గ విస్తరణలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి మంత్రి పదవి రావడం ఖాయం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బుజ్జి, మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నరసింహ, గునిగంటి రాజు, రమేష్ నాయక్, ఉప్పల నాగరాజు, మారగోని శంకర్ గౌడ్ కొండ నవీన్ గౌడ్, ఈసం శివకుమార్, బానోతు కిరణ్ తదితరులు పాల్గొన్నారు

## మర్రిగూడలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా...

నూతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం



**సూర్య ప్రతినిధి, మర్రిగూడ:** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి జన్మదినోత్సవం మర్రిగూడ మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈరోజు సాయంత్రం 5 గంటలకు మునుగోడు నియోజకవర్గంలోని మర్రిగూడ మండల కేంద్రంలో కొత్తగా నిర్మించిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని రాజగోపాల్ రెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు. పార్టీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తల సమక్షంలో ఆయన పుట్టినరోజు వేడుకలు ఆనందోత్సాహాలతో జరిపారు. ఈ కార్యక్రమానికి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ జెడ్పిటిసి మేరీత్ యాదయ్య, మాజీ మార్కెట్ చైర్మన్ రెడ్డి రవీందర్ రావు, మాజీ ఎంపీటీసీలు, మాజీ జెడ్పిటిసీలు, మాజీ సర్పంచులు, గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు రాజగోపాల్ రెడ్డికి పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలియజేశారు. జన్మదిన వేడుకలు మండల వ్యాప్తంగా జరపడం స్థానికంగా సంతోషాన్ని కలిగించింది.

## మర్రిగూడలో టీ అవర్స్ స్టాల్ ప్రారంభించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

**పుట్టినరోజు సందర్భంగా కార్యక్రమంలో భారీగా కార్యకర్తల హాజరు**



సూర్య ప్రతినిధి – మర్రిగూడ: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మర్రిగూడ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటైన టీ అవర్స్ టీ స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కార్యక్రమానికి హాజరయ్యారు. టీ స్టాల్ ప్రొప్రైటర్‌గా గ్యార కుమారస్వామి శ్రీనివాస్ ఉన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటీసీలు, మాజీ ఎంపీటిసీలు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాందాస్, శ్రీనివాస్, మేదరి యాదయ్య, కుంభం శ్రీనివాస్ రెడ్డి, కుంభం అనిల్ రెడ్డి, పాశం సురేందర్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు సర్వజు, భిక్షమాచారి తదితరులు పాల్గొన్నారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతూ ఉత్సాహంగా కార్యక్రమాన్ని జరిపారు. స్థానికంగా కొత్త వ్యాపారానికి ఎమ్మెల్యే చేతులమీదుగా శుభారంభం కావడం ప్రజల్లో ఆసక్తిని కలిగించింది.

## నూతన పట్టువస్త్రలంకరణ మహోత్సవంలో పాల్గొన్న వున్నం బ్రహ్మయ్య



**ఖమ్మం (సూర్య ప్రతినిధి)** నేలకొండపల్లి మండలం సదాశివపురం గ్రామానికి చెందిన చిర్రా శ్రీనివాసరావు –రమాదేవి ల కుమారుడు కుమార్తెల నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవంలో నేలకొండపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వున్నం బ్రహ్మయ్య పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు









**సంస్థాన్ నారాయణపూర్, జూన్, 01( సూర్య ప్రతినిధి ):** మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా సంస్థాన్ నారాయణపూర్ మండల చిమిర్యాల గ్రామంలో నూతనంగా మంచినీటి వాటర్ ప్లాంట్ ను ప్రారంభించి,కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో,గ్రామ ప్రజల సమక్షంలో కేక్ కట్ చేసి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియపరిచారు.అనంతరం గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, చిమిర్యాల మాజీ సర్పంచ్ దోనూరు జైపాల్ రెడ్డి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గం తెలంగాణ రాష్ట్రంలో అత్యంత అద్భుతంగా అభివృద్ధి చెందుతుంది అంటే అది కేవలం ప్రజల మనిషి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చొరవేనని చెప్పుకొచ్చారు.నియోజకవర్గంలో ఎండల తీవ్రతకు భూగర్భ జలాలు అడుగంటడంతో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి,ప్రత్యేక నిధులచే గ్రామ గ్రామాల లు బోర్లు వేయించి మోటార్లు,బిగించి ప్రజల నీటి సమస్యను తీరుస్తున్నారని ఈ సందర్భంగా ఆయన సేవలను దోనూర్ జైపాల్ రెడ్డి కొనియాడారు.రాజన్న గొప్ప సేవా తత్వం,ప్రజల పట్ల అభివృద్ధి కాంక్ష,అకొంటిత దీక్షిత,తో రాబోయే రోజుల్లో మంత్రి వర్గ విస్తరణలో స్థానం దక్కాలని దేవుని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు,మండల నాయకులు, గ్రామ ప్రజలు, కార్యకర్తలు,అభిమానులు,తదితరులు పాల్గొన్నారు.

## మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

# 58 వ జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు









**మునుగోడు నియోజకవర్గ నాయకులు,వివిధ జిల్లాల జిల్లాల నాయకులు, నియోజకవర్గానికి చెందిన దివ్యాంగులు జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన - ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి**

**మునుగోడు, జూన్ 01( సూర్య ప్రతినిధి):** మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి 58 వ జన్మదినం సందర్భంగా మునుగోడు లోనే అధికారిక క్యాంపు కార్యాలయం వద్ద యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని రాజ్ గోపాల్ రెడ్డి ప్రారంభించారు... రక్తదానం చేసిన యువకులకు పత్రాలు అందజేశా రు... అనంతరం తన జన్మదిన సందర్భంగా ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి స్వయంగా అభిమానులు కార్యకర్తలకు వడ్డించారు... రాజగోపాల్ రెడ్డి జన్మదిన సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న కార్యకర్తలు, నాయకులు అభిమానులు శ్రేయోభిలాషులు మునుగోడు క్యాంప్ కార్యాలయానికి చేరుకుని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.. మునుగోడు నియోజకవర్గంతో పాటు వివిధ జిల్లాల నుండి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడానికి పెద్ద ఎత్తున మనుగోడుకి నాయకులు వచ్చారు... కొందరు బొకేలు శాలువాలతో జన్మదిన శుభాకాంక్షలు తెలుపగా..మరికొందరు నోట్ బుక్స్, పెన్నులు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు... నాయకులు కార్యకర్తలు అభిమానులు శ్రేయోభిలాషులతోపాటు అధికారులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు... మునుగోడు నియోజకవర్గానికి చెందిన దివ్యాంగులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పైన ఉన్న అభిమానంతో క్యాంపు కార్యాలయానికి వచ్చి ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు... తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలపడానికి ప్రయాస పడుతూ అభిమానంతో వచ్చిన దివ్యాంగుల మధ్య కూర్చుని వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు... జడ్చర్ల శాసనసభ్యులు అనిరుద్ రెడ్డి తో పాటు, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ బంద్రు శోభారాణిలు మునుగోడు క్యాంపు కార్యాలయంలో కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు...

## మైలార్ దేవ్ పల్లిలో సమస్యలను పరిష్కరించాలి

**డివిజన్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్**



**గండిపేట్, : సూర్య ప్రతినిధి** మైలార్ దేవ్ పల్లి డివిజన్ లో సమస్యలను పరిష్కరించేందుకు బీఆర్ఎస్ పార్టీ చొరవతో పని చేయడం జరుగుతుందని డివిజన్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ అన్నారు. ఈ మేరకు పార్టీ తరపున శుభోదయం మైలార్ దేవ్ పల్లి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఆయన వివరించారు. ఆదివారం శుభోదయం మైలార్ దేవ్ పల్లి కార్యక్రమంలో భాగంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆదేశాల మేరకు డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ ఆధ్వర్యంలో ఆప్కో కాలనీ(ఆదర్శ కాలనీ)లో పర్యటించి అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా రోడ్డుపై ఇరువైపులా చెత్త సమస్య తీవ్రమైందని, పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. దీంతో వ్యాధులు తీవ్రమయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై శానిటేషన్ అధికారులు దృష్టిపెట్టాలని, అలాగే మంచినీటి పైప్ లైన్ లు ప్రతి వీధిలో లేకపోవడంతో డ్రైనేజీ లీక్ అయినప్పుడు సమస్య మంచినీటి పైపులైన్‌లో డ్రైనేజీ నీరు కలుస్తుందని అన్నారు. అలాగే బస్తీలో పూర్తి కానీ రోడ్ నిర్మాణం పనులు అస్తవ్యస్తంగా అసంపూర్తిగా ఎక్కడివి అక్కడే వదిలేసిన వైనం, రోడ్డు వేసే అధికారులు, కనీసం రోడ్డు, రోడ్డుకు మధ్య ఉన్న లింక్స్ కూడా కలపలేదన్నారు. చిన్న చిన్న ప్యాచ్ వర్క్స్ కూడా పట్టించుకోకుండా అధికారుల నిర్లక్ష్యం కళ్లకు కట్టినట్లు కనిపించిందన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అసంపూర్తిగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం జరిగిందని, వాటిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. నిరుపయోగంగా ఉన్న ఆ బెడ్ రూమ్ నిర్మించే ప్రాంతమంతా అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయని, చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నోముల రాము యాదవ్, యూత్ అధ్యక్షులు అక్కెం రాఘవేందర్ యాదవ్, రాజేష్ యాదవ్, సోమ శ్రీనివాస్ గుప్తా, మైసిరెడ్డి, ఎడ్ల కాడి సూర్యం, జి రాజు, ప్రవీణ్, చిరంజీవి, రాజు, కొంపలి జగదీష్ నేత, సరిత నేత, మహేష్ నేత, భూదేవి, అరుణ రెడ్డి, వెంకటరమణ, అశోక్ కుమార్, సునీల్, భాస్కర్ నేత, కార్తీక్ ముదిరాజ్, రిషి తదితరులు పాల్గొన్నారు.

## రమేష్ రజక కుటుంబాన్ని పరామర్శించిన మహబూబ్నగర్ జిల్లా కమిటీ

**రజకులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం : కేతూరి శివన్న**



**మహబూబ్నగర్, జూన్01( సూర్య ప్రతినిధి ):** మహబూబ్నగర్ జిల్లా మిడ్జిల్ మండలం వల్లపురావు పల్లికి చెందిన చాకలి రాధా రమేష్ కుటుంబాన్ని ఆదివారం తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా నాయకులు వారి గ్రామానికి వెళ్ళి పరామర్శించడం జరిగింది. వివరాల్లోకి వెళ్తే గతనెల 22న రమేష్ రజక కుటుంబ సభ్యులపై భూ తగాదలో అదే గ్రామానికి చెందిన ప్రక్క భూమికి చెందిన వ్యక్తులు అకారణంగా దాడి చేసి తీవ్రంగా గాయపరచడం జరిగింది. రమేష్ కుటుంబంపై దాడి చేసిన ప్రక్క భూమికి చెందిన వారిపై వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక మిడ్జిల్ ఎస్సై తో ఫోన్లో మాట్లాడి తగువిధంగా న్యాయం చేయాలని కోరడం జరిగింది. దాడి చేసిన వారిని చట్టపరంగా తగు చర్యలు తీసుకుంటామని ఎస్సై రాష్ట్ర అధ్యక్షుల వారికి హామీ ఇవ్వడం జరిగింది . కుటుంబాన్ని పరామర్శించిన వారిలో మహబూబ్నగర్ జిల్లా అధ్యక్షులు కేతూరి శివన్న, జిల్లా ఉపాధ్యక్షులు ధర్మపురం నాగరాజు, జిల్లా ఉద్యోగ సంఘం నాయకులు సతీష్ ,మహబూబ్నగర్ పట్టణ గౌరవాధ్యక్షులు యాదేశ్ కుమార్, ప్రధాన కార్యదర్శి మైబన్న ,జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రయ్య, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ మున్సిపల్ ఉపాధ్యక్షులు గుండెబోయిన వేణు యాదవ్ ను సన్మానం చేసిన దుర్గయ్య



**చౌటుప్పల్, జూన్ 01( సూర్య ప్రతినిధి):** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ భారతీయ జనతా పార్టీ మున్సిపల్ ఉపాధ్యక్షులుగా ఎన్నికైన గుండెబోయిన వేణు యాదవ్ ను సన్మానం చేసిన ఆ గ్రామ బీజేపీ పార్టీ సీనియర్ నాయకులు కొందూరు దుర్గయ్య హర్షం పరుస్తూ ఆదివారం సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ యూత్ రాజు,చరణ్, అవినాష్, లింగస్వామి, బన్నీ, సాయి, మచ్చి, నవీన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## పదిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సత్కారం

**-భక్త రామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం**



**ఖమ్మం ( సూర్య ప్రతినిధి)** నేలకొండపల్లి భక్త రామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో నేలకొండపల్లి మండల స్థాయిలో పదవ తరగతి పరీక్షలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థి విద్యార్థినీలకు శాలువాతో సత్కరించి మెమోటో ఇచ్చి ఆర్థిక సాయం అందించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నేలకొండపల్లి విద్యాశాఖ అధికారి చలపతిరావు హాజరైనారు. చలపతిరావు ని సర్వీస్ సొసైటీ తరపున ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో భక్త రామదాసు సర్వీస్ సొసైటీ అధ్యక్షులు ఏటుకూరి వెంకటరామారావు ఉపాధ్యక్షులు తెల్లగొర్ల లింగస్వామి కార్యదర్శి గెల వెంకటరమణ గుప్తా క్యాంపు చైర్మన్ వల్లం చెట్ల భాస్కర వైస్ చైర్మన్ చెట్ల భాస్కర్ రెడ్డి మాజీ అధ్యక్షులు జగన్మోహన్ రావు మచ్చ రఘుపతిరావు కనపర్తి కోటేశ్వరరావు పొనగాని శ్రీనివాసరావు ఎలమద్ది లెనిన్ ఈసీ సభ్యులు దేవరశెట్టి లక్ష్మణ్ రావు కొత్త రమేష్ రాయల రమేష్ గరిన వెంకటేశ్వర్లు చావా గణపతి షేక్ ఖాసిం సాహెబ్ మందాడపు వెంకటేశ్వర్లు తదితరులు సభ్యులు పాల్గొన్నారు.

## సంస్థాన్ లో ఘనంగా రాజన్న జన్మదిన వేడుకలు



**సంస్థాన్ నారాయణపూర్,జూన్ 01( సూర్య ప్రతినిధి):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కరెంటోతూ శ్రీను నాయక్ ఆధ్వర్యంలో మునుగోడు శాసనసభ్యులు అసెంబ్లీ టైగర్ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ నాయకులు అందరూ కలిసి కేక్ కటింగ్ చేసి అనంతరం పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా శీను నాయక్ మాట్లాడుతూ మునుగోడు అభివృద్ధి ప్రదాత రాజన్న అని మునుగోడు అభివృద్ధి రాజన్న తోనే సాధ్యమని మునుగోడు లో ఉన్న ప్రతి పేదవాడి ముఖంపై ఆనందాన్ని చూడడమే రాజన్న లక్ష్యం అని ఆపద అని తన తలుపు తట్టిన ప్రతి ఒక్కరిని ఆదుకుంటాడని. రాబోయే కాలంలో తెలంగాణకు దిక్సూచిగా రాజన్న నిలుస్తాడని. వారి అడుగుజాడల్లో మేమందరం నడుస్తూ మునుగోడు అభివృద్ధికి తోడ్పడతామని. తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల, గ్రామ, నాయకులు రాజన్న అభిమానులు పాల్గొనడం జరిగింది.

## మణికొండలో సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరిన కాంగ్రెస్ నాయకులు



**గండిపేట్, : సూర్య ప్రతినిధి** మణికొండ మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జితేందర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యేను పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జితేందర్ మాట్లాడుతూ.. స్థానికంగా సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చర్చించామన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక అధ్యక్షులు కిరణ్ కుమార్, మాజీ కౌన్సిలర్ పురుషోత్తం, మైనారిటీ అధ్యక్షులు షేక్ హాజీ తదితరులు పాల్గొన్నారు.

## మణికొండలో రాష్ట్ర అవతరణ వేడుకలు



**గండిపేట్, : సూర్య ప్రతినిధి** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర అవతరణ వేడుకలను మణికొండ మున్సిపాలిటీలో ఘనంగా నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ఈ మేరకు కమిషనర్ మాట్లాడుతూ.. ఈ నెల 2 వ తేదీ నుంచి 9 వ తేదీ వరకు మున్సిపాలిటీలో పలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా సోమవారం పంచవటి కాలనీ నుండి మర్రిచెట్టు వరకు ప్రజలకు అవగాహన నిమిత్తం ర్యాలీ నిర్వహించడం జరుగుతుం దన్నారు. అనంతరం తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా పురపాలక ప్రత్యేక అధికారి శ్రీనివాస్ రావు చేతుల మీదుగా మణికొండ పురపాలక కార్యాలయ ఆవరణలో పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.

## రాష్ట్ర అవతరణ వేడుకలను పురస్కరించుకొని బీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు

**గండిపేట్, : సూర్య ప్రతినిధి** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం బీఆర్ ఎస్ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నార్సింగ్ మున్సిపల్ అధ్యక్షుడు కే విష్ణువర్ధన్ రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. మంచిరేవుల నార్సింగి కోకాపేట్ గండిపేట్ ఖానాపూర్ వట్టినాగులపల్లిలో సోమవారం ఉదయం 9 గంటల వరకు పార్టీ నాయకులు తరలిరావాలన్నారు. ఈ మేరకు ఇదివరకే ఉన్న పార్టీ జెండా దిమ్మెలను శుభ్రం చేసుకున్నట్లు వివరించారు. పార్టీ నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## తెలుగు స్క్రైబ్ న్యూస్ ఛానల్ కు తనకు సంబంధం లేదని గౌతమ్ గౌడ్ స్పష్టీకరణ

**గండిపేట్, : సూర్య ప్రతినిధి** తెలుగు స్క్రైబ్ న్యూస్ ఛానల్ కు నాకు ఎటువంటి సంబంధం లేదని గౌతమ్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు స్క్రైబ్ న్యూస్ ఛానల్ బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన వాళ్ళు నడిపిస్తారని గౌతమ్ వివరించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. మిస్ వరల్డ్ పోటీలపై, ఇంగ్లాండ్ నుంచి వచ్చిన కంటెస్టెంట్ మహిళకు ఇబ్బందులకు గురి చేశారని ఫహీం ఖురేషి.. రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ పై తప్పుడు వార్త రాసి వాళ్ళ ఇమేజ్ ను డామేజ్ చేశారని రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారన్నారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి తెలుగు స్క్రైబ్ గౌతమ్ గౌడ్, మరో యూట్యూబర్ వసీం ఇద్దరినీ అదుపులో తీసుకున్నారు. గతంలో కూడా హెచ్‌సీయూ భూములపై తెలుగు స్క్రైబ్ ఛానల్ పై కేసు నమోదు చేసిన గచ్చిబౌలి పోలీసులు.. గౌతమ్ ను 41 నోటీస్ ఇచ్చి పంపించారు. పోలీసుల అదుపులో ఉన్న గౌతమ్ రాజేంద్రనగర్ స్టేషన్లో ఓ వీడియో ద్వారా తెలుగు స్క్రైబ్ ఛానల్ కు, తనకు ఎటువంటి సంబంధం లేదనీ తెలిపారు. మరో యూట్యూబర్ వసీం తప్పుడు వార్త రాసినందుకు క్షమాపణ కోరారు. ఈ మేరకు పోలీసుల విచారణ కొనసాగుతుంది.

## మధుర్ నగర్ కాలనీ వాసుల వినతిని స్వీకరించిన కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి

**సీసీ రోడ్ల నిర్మాణంపై చర్యలు తీసుకుంటామని హామీ**



**ఎల్బీనగర్, సూర్య ప్రతినిధి :** హయత్ నగర్ డివిజన్‌లోని మధుర్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, ఆదివారం స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి నివాసానికి వెళ్లి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కాలనీలో పూర్తిస్థాయిలో సీసీ రోడ్ల అందుబాటులో లేకపోవడం వల్ల స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించిన సంక్షేమ సంఘం సభ్యులకు స్పందించిన కార్పొరేటర్, పట్టిష్టమైన ప్రణాళికతో మధుర్ నగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు రవీందర్, నరేష్ గారులతో పాటు పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

# ప్రముఖ కవి రచయిత బుక్కా సత్యనారాయణకు కళా రత్న అవార్డు



**ఖమ్మం ( సూర్య ప్రతినిధి)** హైదరాబాద్ త్యాగరాయ గాన సభలో మే 31 న జరిగిన మెగా హెల్పింగ్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో సాహిత్య సాంస్కృతిక సభ వ్యవస్థాపక అధ్యక్షులు మేనేజింగ్ డైరెక్టర్ శిరీష రెడ్డి ఆధ్వర్యంలో కళా రత్న అవార్డ్స్ అందజేయడం జరిగింది. ఈ పురస్కారం ఖమ్మం జిల్లా నుండి ఇద్దరికి మాత్రమే అందుకున్నారు. వారిలో ఒకరు ప్రముఖ కవి రచయిత నంది అవార్డు గ్రహీత సామాజిక సేవకులు డాక్టర్ బుక్కా సత్యనారాయణ కు ఆ వేదికపై కళా రత్న అవార్డు ప్రముఖుల చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర అడిషనల్ డీజీపీ హైదరాబాద్ రాందాస్ తేజవత్ నాయక్ మరియు హెల్త్ అడ్వైజర్ శ్రీలత సినీ హీరో పృథ్వీరాజ్ రుద్ర ఈవెంట్స్ హైదరాబాద్ రుద్రా శ్రీను సినీ యాక్టర్ ప్రేమ ప్రసాద్ సినీ యాక్టర్ సునీల్ హైదరాబాద్ వారి చేతుల మీదుగా అయ్యా రంగాల్లో సేవలు అందించిన వారికి పురస్కారం కళా రత్న అవార్డు ప్రధానం చేయాలని ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర నుండి నంది అవార్డు గ్రహీత డాక్టర్ సత్యనారాయణకు అందించడం జరిగిందని మెగా హెల్పింగ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మేనేజింగ్ డైరెక్టర్ పి శిరీష రెడ్డి తెలిపారు. ఇలా సేవా దృక్పథం కలవారిని గౌరవించుకోవడం గొప్ప సాంప్రదాయమని పేర్కొన్నారు. బుక్కా సత్యనారాయణ మట్టి మనుషుల మౌనం నివురుగప్పిన నిజం 60 ఏళ్ల సామాజిక సాహితీ ప్రస్థానం వంటి పుస్తకాలు వెలువరించి తన రచనలతో సామాజిక చైతన్యం కలిగించారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొని అప్పటి ముఖ్యమంత్రి చేతుల మీదుగా సాహితీ పురస్కారం నగదు పురస్కారం అందుకున్నారని వారు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్నటువంటి సాహితీమూర్తులు దిగ్గజాల దగ్గర ఎన్నో పురస్కారాలు ఎన్నో అవార్డ్స్ తీసుకోవటం గొప్ప విషయం. ముఖ్యంగా సాహితీ దిగ్గజం డాక్టర్ సి నారాయణ రెడ్డి ని వారు ప్రత్యేకంగా కలుసుకోవడం వారిచే ముందుమాట రాయించుకోవడం వారితో ఎంతో స్నేహంగా ఉండటం ఎంతో చెప్పుకోదగ్గ విషయం. ప్రముఖ సాహితీమూర్తులు గజల్ శ్రీనివాస్ మండలి బుద్ధప్రసాద్ దేశపతి శ్రీనివాస్ సుద్దాల అశోక్ తేజ జయరాజు వంటి ప్రముఖుల సాహితీ వారసత్వంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో సాహితీ సభల్లో పాల్గొని కీర్తి పురస్కారాన్ని అందుకున్నారని వారు గుర్తు చేశారు. వీరు కవి రచయితగా సామాజ సేవకులుగానే కాక వికాస వేదిక సాహితీ సంస్థ రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా తెలంగాణ రచయితల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా రెడ్ క్రాస్ సొసైటీ కార్యవర్గ సభ్యులుగా మున్సిపల్ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షులుగా ప్రిన్సెస్ అసోసియేషన్ గౌరవ సభ్యులుగా సీనియర్ సిటిజన్ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులుగా సేవలు అందిస్తున్నారని ముఖ్యులు అన్నారు. ముఖ్యంగా కరోనా సమయంలో చనిపోయిన వారిని కన్నడం చేయుట చికిత్స పొందుతున్న వారికి అండగా ఉండి వైద్యశాల ఇప్పించడం కరోనా పరిస్థితిలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాల్లో విరివిగా పాల్గొని మరియు అనాథలకు అన్నదానం వివిధ సేవా రంగాలలో సేవలందించడం మానవత్వం గల వ్యక్తిగా సమాజానికి తన సేవలు అందించి ఇప్పుడు నంది అవార్డు డాక్టరేట్ కలవరత్న అవార్డు ఇలా ఎన్నో పెద్దల సమక్షంలో సాహితీ పురస్కారాలు అందుకోవటం నిజంగా గర్వించదగ్గ విషయం. ఇంకా నిరుపేదలకు అనాథలకు 65 మందికి ఎంతో వేరే ప్రయాసాలతో వారికి వృద్ధాప్య వితంతు పెన్షన్లు మంజూరు చేయించారు. వారి సేవలను గుర్తించి హైదరాబాద్ కి పిలిపించి త్యాగరాయ గాన సభలో కలరత్నం అవార్డు వారికి ప్రధానం చేయడం మా సంస్థకు ఎంతో గర్వంగా ఉందని వారు తెలిపారు. సత్యనారాయణ ఇంకా ఎన్నో పురస్కారాలు అవార్డులు అందుకోవాలని అన్నారు. సత్యనారాయణ ఈ అవార్డ్స్ అందుకోవడం మా సాహితీ సంస్థకు సాహితీ లోకానికి ఎంతో గర్వకారణం అని వికాస వేదిక అధ్యక్షులు కార్యదర్శి సాధనాల వెంకటస్వామి నాయుడు లెజెండ్ శ్రీనివాస్ కొంపెల్లి రామయ్య ఆంబోతు జయ వాసు గాజుల భారతి ఎడవల్లి శైలజ శ్రీనివాస్ కొత్త శంకర్ రెడ్డి మరి వికాస వేదిక భద్రాద్రి కొత్తగూడెం మహబూబాద్ సూర్యపేట అధ్యక్ష కార్యదర్శులు వారి కార్యవర్గం మరియు గుర్రం జాషువా సాహిత్య వేదిక అధ్యక్షులు కార్యదర్శి మువ్వా శ్రీనివాసరావు పగిడిపల్లి వెంకటేశ్వర్లు అక్షరాలతో నిర్వాహకులు నామా పురుషోత్తం రాస మల్ల ఉపేందర్ దాసరి శ్రీనివాస్ కన్నెగంటి వెంకటయ్య రౌతు రవి పలు పలువురు కవులు రచయితలు సామాజికవేత్తలు సత్యనారాయణకు కళా రత్నం అవార్డు రావడం ఎంతో ఆనందదాయకమని వారు ఇంకెన్నో పురస్కారాలు అందుకోవాలని అన్నారు.

# సమ్మర్ కంప్యూటర్ క్యాంప్ ద్వారా విద్యార్థులకు నూతన పరిజ్ఞానం





**తెలంగాణ రాష్ట్ర ఆర్ టీ ఐ కమీషనర్ అడ్వకేట్ దేశాల బూపాల్**

**నవ యువ యూత్ క్లబ్, సేవా భారతి కిషోరి వికాస్ సేవా కార్యక్రమం లు అభినందనీయం**

**దాతల తోడ్పాటు గల సాంకేతిక శిక్షణకు ఘనసమాప్తి**

**శ్రీ మార్కండేయ పద్మ శాలి ట్రస్ట్ భవనం, సేవా భారతి కిషోరి వికాస్ సహకారాంతోనే క్యాంపు ఘనవిజయం**




**గండిపేట్ : సూర్య ప్రతినిధి** నవ యువ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో, అధ్యక్షులు ఏర్వ కుమారస్వామి నేతృత్వంలో, సాంస్కృతిక కార్యదర్శి గోంత్యాల శ్రీనివాస్ నిర్వహణలో నిర్వహించబడిన సమ్మర్ కంప్యూటర్ శిక్షణ క్యాంప్ ఆదివారం అత్యంత వైభవంగా ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమం రాజేంద్రనగర్ సర్కిల్, మైలర్ దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని భవన ఋషి నగర్ లోని శ్రీ మార్కండేయ ట్రస్ట్ భవనంలో జరిగింది. ముఖ్య అతిధిగా తెలంగాణ రాష్ట్ర ఆర్టీ అడ్వకేట్ దేశాల భూపాల్ హాజరయ్యారు. ఆయనతో పాటు తెలంగాణ సేవా భారతి కిషోరి వికాస్ కార్యదర్శి జయప్రద, తెలంగాణ పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు ఏర్వ సత్యనారాయణ, సహాయ కార్యదర్శి కాశీగారి యాదగిరి, రంగారెడ్డి జిల్లా పద్మశాలి యువజన సంఘ అధ్యక్షులు కొంపల్లి జగదీష్, ఉపాధ్యాయులు మహేశ్వర్ హాజరయ్యారు.

ఈ కార్యక్రమంలో టీచర్లకు శాలువా తో సత్కారం చేసి, సర్టిఫికెట్లు మరియు బహుమతులు అందజేశారు. విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిధి తెలంగాణ రాష్ట్ర ఆర్ టీ ఐ కమీషనర్ అడ్వకేట్ దేశాల భూపాల్ మాట్లాడుతూ... ఇలాంటి శిక్షణ శిబిరాలు గ్రామీణ యువతకు సాంకేతిక విద్యపై అవగాహన కల్పించి, భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలను పొందేందుకు దోహదపడతాయి. ఇలాంటి కార్యక్రమాలు మరింతగా జరగాలని మనం ఆశించాలి" అని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మహేశ్వర్ మాట్లాడుతూ... ఈ తరహా శిక్షణ కార్యక్రమాలు విద్యార్థుల్లో నూతన పరిజ్ఞానంపై ఆసక్తి పెంచుతాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఎంతగానో అవసరం. విద్యార్థులు ప్రదర్శించిన నైపుణ్యం, వారిలో చూపిన ఆసక్తి భవిష్యత్తులో మంచి మార్గాన్ని చూపుతుంది" అని పేర్కొన్నారు. ఏర్వ సత్యనారా యణ మాట్లాడుతూ... ఈ శిక్షణ కార్యక్రమం గ్రామీణ ప్రాంత యువతకు సాంకేతిక విజ్ఞానాన్ని అందించడం మాత్రమే కాక, వారి సామర్థ్యాలను పెంపొందించడానికి పెద్ద అవకాశం. ఇలాంటి కార్యక్రమాలు ఎక్కువగా నిర్వహించాలి, మరింత మంది యువత లాభం పొందాలని ఆశిస్తున్నాం అని అన్నారు. కాశీగారి యాదగిరి మాట్లాడుతూ...విద్యార్థులలో సాంకేతిక విద్య పట్ల చూపిన ఆసక్తి ఎంతో హృదయస్పర్శి. సమ్మర్ క్యాంప్ వారు పొందిన నైపుణ్యాలతో తమ భవిష్యత్తు నిర్మించుకోగలరు. ఇలాంటి కార్యక్రమాలు పలు గ్రామాలలో విస్తరించాలని కోరుకుంటున్నాం" అని తెలిపారు. కొంపల్లి జగదీష్ మాట్లాడుతూ... సాంకేతిక శిక్షణ ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు పెరిగిపోవడం ఒక విశేషం. ఈ కార్యక్రమం యువతకు మంచి ప్రేరణ. మరిన్ని ఇలాంటి శిక్షణలు జరిగి గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాను అని పేర్కొన్నారు. నిర్వాహకులు ఏర్వ కుమారస్వామి, గోంత్యాల శ్రీనివాస్, హేమలత మాట్లాడుతూ... ఈ శిబిరం ద్వారా గ్రామీణ విద్యార్థులకు ఆధునిక సాంకేతిక విజ్ఞానాన్ని అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాము. మంచి స్పందన వచ్చింది. విద్యార్థుల ఉత్సాహం భవిష్యత్తులో వారిని మంచి మార్గదర్శకులుగా మార్చుతుందని విశ్వసిస్తున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సామల యాదయ్య , అదేట్ల నరేష్,అదేట్ల బాలరాజ్ ఆర్పీ గుర్రం తిరుపతమ్మ, ఐ లక్ష్మి, స్వప్న, రాజ్యలక్ష్మి, శ్రావణి, అక్షిత, ఐశ్వర్య, భార్గవి, గాయత్రి, దినేష్, జగదీష్, ఋషికేష్, విద్యార్థుల తల్లి తండ్రులు పాల్గొన్నారు.

## యుపిఎఫ్ కన్వీనర్ గా శివ శంకర్‌ను
# ప్రకటించిన కల్వకుంట్ల కవిత

- యూపీఎఫ్ బీసీ ఉద్యమ సేనానిగా బోళ్ల శివశంకర్
- బీసీ ఉద్యమాన్ని గ్రామస్థాయిలో బలోపేతం చేస్తాం - శివశంకర్




**హైదరాబాద్, జూన్ 01(సూర్య ప్రతినిధి):** శాసనమండలి సభ్యురాలు తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీసీ ఉద్యమాన్ని ముందుండి నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తున్న బోళ్ల శివశంకర్ ను ఆదివారం ఉదయం తెలంగాణ జాగృతి కార్యాలయంలో యునైటెడ్ ఫులే ఫ్రంట్ కన్వీనర్ గా నియమించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు, కామారెడ్డి డిక్లరేషన్, అసెంబ్లీలో జ్యోతిరావు ఫూలే విగ్రహ ఏర్పాటు వంటి బిసి సామాజిక సాధికారత అంశాల పైన నిరంతరం కొట్లాడుతున్న శివశంకర్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేతృత్వంలో యునైటెడ్ పూలే ఫ్రంట్ పక్షాన రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లో సభలు, సమావేశాలు, రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సులు, బహిరంగ సభలు నిర్వహించారు. అసెంబ్లీలో జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఇప్పటికే యునైటెడ్ పూలే ఫ్రంట్ పక్షాన అనేకమంది ఎమ్మెల్యేలను కలిసి వినతి పత్రం అందజేశారు. బీసీ కులాల్ని ఏకం చేయడం కోసం బీసీల్లోని ఎంబీసీ సంచార జాతుల సంఘాలను కలుపుకొని డెబ్బైకి పైగా కులాలతో యూపీఎఫ్ నీ బలోపేతం చేసారు. సందర్భంగా బోళ్ల శివ శంకర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో యుపిఎఫ్ కన్వీనర్ గా నియమించిన కల్వకుంట్ల కవిత కి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ ఉద్యమంలో తన వెంట నడుస్తున్న ప్రతి బీసీ కుల సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వాల మెడలు వంచి 42 శాతం రిజర్వేషన్ సాధిస్తామని స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు అమలయ్యేందుకు ఉద్యమం చేస్తామని తెలిపారు. గ్రామస్థాయిలో బీసీల్లో రాజకీయ చైతన్యం తీసుకొచ్చేందుకు విస్తృతంగా పనిచేస్తామని అందుకు తగిన కార్యాచరణ త్వరలో ప్రకటిస్తామని, ఇప్పటికే జిల్లా స్థాయిలో నాయకత్వాన్ని రూపొందించినట్టు దానిని అట్టడుగు స్థాయి వరకు విస్తరిస్తామని ఎట్టి పరిస్థితుల్లో బీసీ రిజర్వేషన్లు లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలను జరగనివ్వమని తెలిపారు. కల్వకుంట్ల కవిత అంటే డెడికేషన్ కు మారుపేరని తాను ఒక నిర్ణయం తీసుకుందంటే అది అమలయ్యేందుకు ఎన్ని ఇబ్బందులనైనా తట్టుకొని ముందుకు పోయే శక్తియుక్తులు ఆమెకు ఉన్నాయని, తెలంగాణ రాష్ట్ర పోరాటంలో తాను చేసిన ఉద్యమ అనుభవంతో ఈ బీసీ ఉద్యమాన్ని అనుసంధానం చేసి కచ్చితంగా బీసీల ఆత్మ గౌరవాన్ని రాజ్యాధికారాన్ని సాధిస్తామని తెలియజేశారు. ఈ పోరాటంలో ఆమె వెంట నడుస్తామని తెలిపారు. ఇప్పటికే సావిత్రిబాయి పూలే జన్మదినాన్ని మహిళా ఉపాధ్యాయ దినోత్సవం గా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని అది తాము ఇందిరాపార్క్ వద్ద చేపట్టిన సావిత్రిబాయి పూలే జయంతి దీక్ష వల్లనే అని తెలిపారు. బీసీ ఉద్యమం చీలికల పేలికలుగా ఉందని మనమంతా ఒక్కటిగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని సమీప ఉద్యమ నేతలకు ఆహ్వానం తెలియజేశారు. భిన్న కేంద్రాలతో అంతా పనిచేస్తున్నప్పటికీ లక్ష్యం ఒకటేనని గుర్తు చేశారు. మనమంతా బిసి గొడుకు కింద ఉమ్మడి కార్యాచరణతో పనిచేయకపోతే బీసీ రాజ్యాధికారం సాధికారత ఎన్నటికీ మిగిలిపోతుందని విజ్ఞప్తి చేశారు.

# రైతన్నా ఏది నీ గౌరవం? ఏంటి ఈ ఘోరం?

పంటకి మద్దతు ధర లేదు.. వస్త్రధారనకి గౌరవం లేదు..
పెళ్లికి అంగీకారం లేదు.. చివరికి ప్రాణానికి విలువ లేదు!

మట్టిపై మమకారంతో జీవితాంతం బ్రతికే రైతు చివరికి ఆ మట్టిలో కలిసే దాకా అయినా ఆత్మగౌరవంతో బ్రతికేలా చేయడం అందరి బాధ్యత

స్వేదాన్ని ఆయుధంగా మార్చి శ్రమను పెట్టుబడిగా మలిచి సేద్యం అనే యుద్ధంలో నిత్య శ్రామికుడిగా పోరాడుతూ అందరి ఆకలిని తీర్చే అన్నదాతల పట్ల ఈ వ్యవస్థల వైఖరి ఏంటి?









**అనంతపురం, జూన్ 01(సూర్య ప్రతినిధి):** రైతు ఉనికే ఈ దేశానికి ధైర్యం.రైతు చేతిలో పుట్టిన విత్తనమే ఈ దేశానికి ప్రాణం. రైతు చేతితో తడిసిన నేలే ఈ దేశానికి అన్నపూర్ణ. కానీ ప్రస్తుత సమాజం రైతును చూసే కోణం మాత్రం చాలా దారుణంగా ఉంటుంది ఇది నేటి సమాజపు మానసిక వైకల్యానికి నిదర్శనంగా మారుతుంది . తడిసిన వడ్ల కోసం తహసీల్దార్ కాళ్లు మొక్కాల్సిన దుస్థితిలో నేటి రైతులు: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తెలంగాణ రాష్ట్రంలో చాలా జిల్లాలో వడ్ల కొనుగోలు కేంద్రాలలో వడ్లు తడిసి మొలకెత్తిన సంఘటనలు చాలా చోట్ల జరిగాయి, చాలా రోజులుగా వడ్లు కొనుగోలు కేంద్రాలలోనే ఉండడం ఈ దుస్థితికి కారణం ఇలాంటి పరిస్థితులలో వడ్లను కొనాలని మహబూబాబాద్ లో మహిళా రైతులు అధికారాల కాళ్లు మొక్కడం రైతుల ఆత్మగౌరవానికి ఆటంకంగా మారింది , ఇలాంటి పరిస్థితులు రైతులకు నిత్యం ఎక్కడో అక్కడ ఎదురవుతూనే ఉన్నాయి ఇది రైతుల పట్ల ప్రభుత్వాల వైఖరికి నిదర్శనంగా నిలుస్తాయి ఇలాటివి పార్టీలతో సంబంధం లేకుండా ఏ పార్టీ అధికారంలో ఉన్నా జరగడం ఆమోదించతగినది కాదు

**వేషధారణ చూసి వెక్కిరించే పరిస్థితి:**

ఆ మధ్య కాలంలో కర్ణాటకాలో రైతు పంచ కట్టుకొని ఉన్నాడని , బట్టలు మాసి పోయి ఉన్నాయయని మెట్రో రైలులోకి అనుమతించలేదు, అలాగే మరో రైతును షాపింగ్ మాల్ లోని థియేటర్ లోకి అనుమతించలేదు. ఈ సంఘటనలు దేశవ్యాప్తంగా నిత్యం ఎక్కడో అక్కడ జరుగుతూనే ఉన్నాయి ఇవి రైతుల పట్ల సమాజ వైఖరిని తెలుపుతున్నాయి, దేశానికే గర్వకారణమైన అన్నదాతను అగౌరవపరచడం వ్యవస్థ వినాశనానికి దారి తీస్తుంది

**యువ రైతులకు పెళ్లి కలగానే మిగులుతోంది :**

ఇటీవల కాలంలో వ్యవసాయం చేసే చాలా మంది యువకులకు పెళ్ళిళ్లు కావడం కష్టంగా మారింది వ్యవసాయాన్ని నమ్ముకుని జీవనం సాగించే యువతకు పెళ్లికి అమ్మాయిని ఇవ్వడానికి చాలా మంది అమ్మాయి తల్లిదండ్రులు ముందుకు రావడం లేదు, కారణం ఉద్యోగ భద్రత లేదని, స్థిరమైన ఆదాయం లేదని అమ్మాయిల తల్లిదండ్రులు తిరస్కరిస్తున్నారు. ఇది కేవలం ఒకరి వ్యక్తిగత బాధ కాదు, వ్యవసాయ రంగాన్ని చిన్నచూపు చూసే సమాజపు ఆలోచనా ధోరణికి ఇది నిదర్శనం ఎంత గొప్ప ఉద్యోగం చేసేవాడు అయినా సంపాదించిదంతా చివరికి భూమిపైనే పెట్టుబడి పెడుతున్నాడు, వారి కోసం పిల్లనివ్వడానికి పోటీ పడుతుంటారు, అదే భూమిని నమ్ముకునే జీవితాన్ని సాగించే రైతులకు మాత్రం పిల్లనివ్వడానికి వెనకడుగు వేస్తున్నారు ఇదే ఈ సమాజపు వింత పోకడ..

**మద్దతు ధరలు లేవు ,అప్పులు పెరిగాయి, చివరికి రైతుల ఆత్మహత్యలే మిగిలాయి**

పంటలకు పెట్టుబడులు పెరిగాయి, దిగుబడులు తగ్గాయి, వచ్చిన పంటకు మద్దతు ధరలు లేకపోవడం, వంటి అనేక సమస్యల వలన రైతు అప్పుల ఊబిలో చిక్కుకుపోయి చివరకు ఆత్మహత్యే శరణ్యంగా భావిస్తున్నాడు, ఇది రైతుల పట్ల ప్రభుత్వాల వైఖరికి అద్దం పడుతుంది రాజకీయ వేదికలపై 'రైతేరాజు' అనే మాటలు కాదు క్షేత్ర స్థాయిలో రైతులకు అండగా నిలవడం కావాలి , నాయకుల ఉపన్యాసాలలో రైతును గౌరవించడం కాదు దేశం గర్వ పడేలా రైతును ఆర్ధికంగా అభివృద్ధి చేయవలసిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీ, నాయకుల పై ఉంది

**పంట రైతుది, లాభం దళారులది**

ఎంతో కష్టపడి రైతు పంటను పండిస్తే ఆ పంటలు చివరికి రైతుకు నష్టాన్ని, దళారులకు లాభాలను తెచ్చి పెడుతున్నాయి కారణం , మార్కెట్ సిండికేట్ అని, కమిషన్ అని, నాణ్యత బాగోలేదని, రేట్ తగ్గువ ఉంది అని రైతులను భయభ్రాంతులకు గురిచేసి కొంత మంది దళారులు రైతుల దగ్గర తక్కువకు కొని మార్కెట్ లో ఎక్కువ ధరలకు అమ్ముకొని లాభాలను పొందుతున్నారు ఇది రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నది , ప్రభుత్వాలకు వీటిపై నియంత్రణ లేకపోవడం కూడా వీటికి ప్రధాన కారణం

**రాజకీయ నాయకులు, ప్రభుత్వాలు చేపట్టవలసిన అత్యవసర చర్యలు:**

రైతును రాజుగా మార్చడం అటుంచి కనీసం రైతును ఆత్మగౌరవంతో బ్రతికేలా చేయడం అందరి బాధ్యత
రైతును రాజకీయ పార్టీలు చూడాల్సింది ఓటు బ్యాంకు లా కాదు బ్యాంకులో దాచుకున్న విలువైన సంపదలా ..

మద్దతు ధరలు ఖచ్చితంగా అమలు చేయాలి. కనీస లాభంతోపాటు

**స్థిరమైన ధరలను నిర్దేశించాలి.**

రైతులే నేరుగా వారి ఉత్పత్తులను అమ్ముకునే వీలు కల్పించాలి, దానికి తగినట్టుగా సమీపంలోనే మార్కెట్ యార్డ్స్ నీ నిర్మించాలి
వ్యవసాయంలో పంటలకు, రైతులకు బీమా పూర్తి స్థాయిలో అమలవాలి. బీమా మొత్తం రైతుకు , రైతు కుటుంబ సభ్యులకు స్వయంగా, సమయానికి చెల్లించాలి.
తడిసిన ధాన్యాలను, ప్రభుత్వం మద్దతు ధర తో పాటే కోనుగోలు చేయాలి
పెట్టుబడి సబ్సిడీలు నేరుగా రైతుల ఖాతాల్లోకి వేగంగా చెల్లించాలి.
రైతు కుటుంబాలకు ఆరోగ్య, విద్య భరోసా పథకాలను సమర్ధంగా అమలు చేయాలి.
రైతుల సమస్యలను రాజకీయ ప్రసంగాలకే పరిమితం చేయకుండా అమలులో కృషి చేయాలి
రైతులతో నేరుగా భేటీ అయి వారి సమస్యలపై ప్రణాళిక బద్ధమైన నివేదికలను తయారు చేసి, అసెంబ్లీలో, పార్లమెంటులో చర్చించాలి.
కౌలు రైతులకు పింఛన్లు అందించడం , వృద్ధ రైతులకు ఆర్థిక భరోసాని కల్పించడం చేయాలి
వ్యవసాయాన్ని ఒక పరిశ్రమగా గుర్తించి, వ్యవసాయంలో పెట్టుబడులను, సాంకేతికతను ప్రోత్సహించాలి, దానికి లాభసాటిగా మార్చాలి రైతు ప్రాణం చాలా విలువైనది రైతును కాపాడుకుంటేనే దేశం అభివృద్ధి చెందుతుంది . రైతును గౌరవించడం , రైతును ఆత్మగౌరవంతో జీవించేలా చేయడం మన అందరి బాధ్యత . రైతు ఆత్మగౌరవమే దేశానికి ఆభరణం అన్నదాతల ఆత్మహత్యారహిత భారతాన్ని నిర్మించాలి అదే అసలైన దేశాభివృద్ధి

జి. అజయ్ కుమార్
సామాజిక విశ్లేషకులు

## శివరాంపల్లి జడ్పీహెచ్ఎస్‌లో కన్నుల పండుగగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**గండిపేట్, : సూర్య ప్రతినిధి** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2011-12 సంవత్సరంలో పదవ తరగతి అభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన వేడుకలో పూర్వ విద్యార్థులంతా ఒకచోట చేరి బాల్యంలో గడిపిన నాటి స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఒకరి యోగక్షేమాలు మరొకరు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యాబుద్దులు నేర్పి ప్రయోజకులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమానికి పర్యవేక్షకులుగా అనూష, మీనాక్షి, గౌతమి, రాధ, మాధవి, సాయికుమార్, శివసేన, శివప్రసాద్, దినకర్, ప్రశాంత్, పరమేష్, తిరుమలేష్ లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో నాటి ప్రిన్సిపల్ అరుణ, ఉపాధ్యాయులు ప్రసన్నలక్ష్మి, కవిత, రాజశ్రీ, హేమలత, సుజాత, పద్మ శ్రీ, కరుణ, శాస్త్రీ, పద్మ రాఘవల్లి, కృష్ణమూర్తి, షైనీ ప్రసన్న, విజయ్ కుమార్, బుద్ధాదేవ్, చెన్నయ్య, వినోబా చారి, వెంకటేశ్వర్లు, ప్రస్తుత ప్రిన్సిపల్ కిషన్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## జూన్ 10న ముత్యలమ్మవ్వ దేవర

ప్రతి ఏటా ఎంతో వైభవంగా దేవర మహోత్సవ వేడుకలను నిర్వహిస్తున్న ఆలయ ప్రధాన పూజారి, భక్తులు...

- వేల సంఖ్యలో తరలిరానున్న భక్తులు....

ఏర్పాట్లు చేస్తున్న ఆలయ ప్రధాన పూజారి ముత్యాల గంగరాజు



**గుంతకల్, జూన్ 01(సూర్య ప్రతినిధి):** గుంతకల్ మండల పరిధిలోని జి. కొట్టాల గ్రామంలోని ముత్యాలమ్మవ్వపేట లో కొలువుదీరిన నసనకోట శ్రీ ముత్యాలమ్మవ్వ వారి దేవర మహోత్సవ వేడుకలు జూన్ నెల 10వ తేదీన నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ప్రధాన పూజారి ముత్యాల గంగరాజు స్వామి తెలిపారు. దేవరకు వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉందన్నారు. దేవర ఉత్సవంలో పాల్గొనే భక్తులకు తాగునీరు, వసతి, భోజన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. దేవర ఉత్సవంలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన భక్తులను కోరారు.

## ఘనంగా నేలకొండపల్లి హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం





**ఖమ్మం ( సూర్య ప్రతినిధి)** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి హైస్కూల్ 1999-2002 బ్యాచ్ లో చదువుకున్న విద్యార్థులు నిన్న పాఠశాల ప్రాంగణంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందోత్సాహాలతో గడిపారు. నాటి విద్యార్థులు వివిధ రంగాల్లో సెటిలై 23 ఏళ్ల తర్వాత మళ్ళీ కలుసుకోవడంతో వాళ్ళ ఆనందాలకు అవధులు లేకుండా పోయింది. నాడు వారికి బోధించిన ప్రధానోపాధ్యాయులు రాజు సార్ ఉపాధ్యాయులు ఝాన్సీ మేడం సీతా మేడం ఆశ మేడం ధనమూర్తి సార్ జగనాదం సార్ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం పసందైన వంటకాలతో సహ పనికి భోజనం చేశారు.ఆటపాటలతో డాన్సులతో గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కణతాల వెంకటేశ్వర్లు బాబు ప్రియాంక లావణ్య రమేష్ నరేష్ రసూల్ నాగ దుర్గ వసంత నాగేశ్వరరావు మల్లయ్య చెక్కల శీను మీరా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.




# కిరణ్ అబ్బవరం కొత్త మూవీ అప్‌డేట్!



క మూవీ సూపర్ హిట్ తర్వాత యంగ్ హీరో కిరణ్ అబ్బవరం దిల్ రుబా అంటూ ప్రేక్షకుల ముందుకొచ్చారు. అయితే ఈ లవ్ స్టోరీ టాలీవుడ్ సినీ ప్రియులకు అంతగా కనెక్ట్ కాలేదు. మార్చిలో థియేటర్లలో విడుదలైన ఈ సినిమాకు ఫర్వాలేదనిపించినా కలెక్షన్లపరంగా రాబట్టిలేకపోయింది. ఈ మూవీ తర్వాత మరోసారి ప్రేమకథతోనే అభిమానుల ముందుకు రానున్నారు. తాజాగా తన కొత్త మూవీకి సంబంధించిన అప్‌డేట్ ఇచ్చారు కిరణ్ అబ్బవరం. అయితే ఈ సారి కాస్తా భిన్నంగానే ఉంటుందని అంటున్నాడు కిరణ్. 'ప్రేమ కథలు చాలానే ఉంటాయి%ా%. కానీ ఇది మాత్రం .. రేపు కలుద్దాం' అంటూ అభిమానుల్లో అంచనాలు పెంచేశాడు. ఈ సినిమాకు సంబంధించి టైటిల్, గ్లింప్స్ సోమవారం విడుదల చేస్తామని ట్వీట్ చేశారు. ఈ మేరకు ఆయన పోస్టర్‌ను పంచుకున్నారు. పోస్టర్ చూస్తుంటే ఫుల్ లవ్ అండ్ ?రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గానే తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో గౌరీ ప్రియ హీరోయిన్‌గా నటిస్తోంది.

## తనకి బతకాలని లేదనే బాధని రష్మికతో పంచుకున్న అభిమాని..




ఛలో అనే సినిమాతో తెలుగు ప్రేక్షకులని పలకరించి ఆ తర్వాత మంచి విజయాలు అందుకొని బాలీవుడ్‌లోను సత్తా చాటుతుంది. ఇప్పుడు పాన్ ఇండియా స్టార్‌గా మారిన ఈ ముద్దుగుమ్మ గత కొద్ది రోజులుగా విజయ్ దేవరకొండతో ఎఫైర్ విషయంలో ఎక్కువగా వార్తలలో నిలుస్తూ ఉంటుంది. అయితే రష్మిక ఈ స్థాయికి రావడానికి చాలా కష్టాలు పడింది. ఆమె జీవితం పూలపాన్పు ఏమీ కాదు. చిన్నప్పుడుఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న ఈ అమ్మడు ఎన్నో అవరోధాలని ఎదుర్కొంటూ ఈ స్థాయికి చేరింది. బాల్యంలో తన తల్లిదండ్రులు అద్దె కట్టలేక ఎన్నోసార్లు ఇళ్లు మారాల్సి వచ్చిందని, పేరెంట్స్ పడుతున్న కష్టాలు చూసి కనీసం ఓ బొమ్మ కొనివ్వమని కూడా అడిగేదాన్ని కాదంటూ అప్పట్లో ఓ ఇంటర్వ్యూలో తెలిపింది. అయితే చిన్నప్పుడు పడ్డ ఆ ఆర్థిక కష్టాలే తనకు డబ్బు విలువ తెలియజేసేలా చేసిందని పేర్కొంది. కెరీర్ విషయంలో స్థిరంగా ఉండాలని, మనసుకు నచ్చిన పని చేయాలని తాను అందరికీ సలహా ఇస్తానంటూ రష్మిక పేర్కొంది. కూర్గ్ లాంటి ఒక చిన్న పట్టణంలో పుట్టిన తాను, ఈరోజు ఈ స్థాయిలో ఉన్నానంటే అందుకు కారణం వచ్చిన ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగడమే అని తెలియజేసింది. ఈ ప్రయాణంలో ఎదురయ్యేవి కఠినమైన పాఠాలు కావు, అన్నీ విలువైన అనుభవాలే. ఎల్లప్పుడూ ఉత్తమంగా ఉండేందుకు ప్రయత్నించండి. కానీ, ఇతరులను సంతోషపెట్టాలనే భారాన్ని మాత్రం మోయకండి. మీ ఆనందంపై దృష్టి సారించండి అని స్ఫూర్తిదాయకమైన సలహాలు ఇచ్చింది. ఇక ఒక అభిమాని, "జీవితంలో ప్రతిదీ తప్పుగా జరిగే సమయంలో, కనీసం బతకాలని కూడా అనిపించకపోతే, ఎలా ఎదుర్కోవాలి? నేను విలువలేని మనిషినిగా అనిపిస్తోంది. దయచేసి సూచనలివ్వండి" అంటూ రష్మికను అడిగారు.దానికి స్పందించిన రష్మిక.. , "నీకు నమ్మకంగా ఉన్న వాళ్ళ మధ్య ఉంటే ఈ రోజు కూడా గడిచిపోతుంది అని నమ్మాలి. అదే పనిని రేపూ, ఎల్లుండీ కొనసాగిస్తూ ఉంటే ఆ తరువాత నీకే అర్థం అవుతుంది.. నీవు ఎదుగుతున్నావు అని, కష్టాలని సమర్ధవంతంగా ఎదుర్కొంటున్నావు అని. ఆ తర్వాత నీ శక్తిని చూసి నీకే గర్వంగా అనిపిస్తుంది అంటూ రష్మిక చాలా తెలివిగా అభిమానికి సమాధానం ఇచ్చింది. ఆమెపై ప్రశంసల జల్లు కురుస్తుంది. కాగా, రష్మిక మందన్న గత రెండేళ్లలో నటించిన మూడు బ్లాక్‌బస్టర్ సినిమాలు యానిమాల్, పుష్ప 2, ఛావా ప్రపంచవ్యాప్తంగా ఏకంగా 3వేల 300 కోట్లకుపైగా వసూళ్లు సాధించిన విషయం తెలిసిందే.



## మ్యాడ్ హీరో గ్యాంబ్లర్స్ ట్రైలర్ మాములుగా లేదుగా.. పక్కా హిట్టేనా?

'మ్యాడ్', 'మ్యాడ్ స్క్వేర్' సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన సంగీత్ శోభన్ ఇప్పుడు తన ప్రధాన పాత్రలో గ్లాంబ్లర్స్ అనే చిత్రంతో ప్రేక్షకులని పలకరించేందుకు సిద్ధమయ్యాడు. ఎప్పుడో విడుదల కావలసిన ఈ చిత్రాన్ని ఇప్పుడు థియేటర్స్‌లోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రమోషన్స్ జోరుగా చేస్తూ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నారు. నాలుగు రోజుల క్రితం టీజర్, ఫస్ట్ సాంగ్ ను రిలీజ్ చేసారు. తాజాగా ట్రైలర్ ను ఆవిష్కరించారు.'ఆడటం చేతగాని వాడికి జూదం అంటే నేరం అనిపిస్తుంది.. ఆడటం తెలిసిన వాడికి జూదం నేరం కాదు ' అంటూ ప్రారంభమైన ఈ ట్రైలర్ లో ఒక క్లబ్ లో జరిగే సన్నివేశాలను చూపించారు. ఇందులో కొందరు వ్యక్తులు క్లబ్ లో గేమ్ ఆడటం, హీరో వాళ్ళతో ఏదో డీల్ సెట్ చేసుకోవడం, దాని వెనుక ఇంకేదో మిస్టరీ ఉందని అనుకునేలా ఈ ట్రైలర్ ఉంది.ఈ చిత్రంలో మిస్టరీతో పాటు ఎంటర్‌టైన్‌మెంట్ దండిగా ఉంటుందని అర్థమవుతుంది. మ్యాడ్, 'మ్యాడ్ స్క్వేర్' సినిమాల్లో కామెడీతో ఆకట్టుకున్న సంగీత్ శోభన్.. గ్యాంబ్లర్స్ అనే చిత్రంలో చాలా భిన్నమైన పాత్రలో కనిపించనున్నారు. కౌబాయ్ తరహా కాస్ట్యూమ్స్ లో కనిపించి ఆకట్టుకున్నారు. ప్రశాంతి చారులింగా, రాకింగ్ రాకేష్, పృథ్వీరాజ్, సాయి శ్వేత, జస్విక, భరణి శంకర్, మల్హోత్ర శివ, శివారెడ్డి, శ్రీకాంత్ అయ్యంగార్, మధుసూదన్ రావు తదితరులు ఈ చిత్రంలో ఇతర పాత్రలు పోషించారు. ప్రముఖ రచయిత, దర్శకుడు విజయేంద్రప్రసాద్ దర్శకత్వంలో శ్రీవల్లి అనే సైన్స్ ఫిక్షన్ సినిమాను నిర్మించిన నిర్మాతలు సునీత, రాజ్‌కుమార్ బృందావనంలు రేష్మాస్ స్టూడియోస్, స్నాప్ అండ్ క్లాప్ ఎంటర్‌టైన్ మెంట్ పతాకంపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కేఎస్‌కే చైతన్య ఈ చిత్రానికి దర్శకుడు. పూర్తి వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని రూపొందించగా, ఈ చిత్రం చిత్రం అన్ని వర్గాలను అలరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జూన్ 6న చిత్రాన్ని విడుదల చేయనున్నారు. మరి ఈ సినిమా ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి.

## హిట్ మూవీ సీక్వెల్.. ఆఫర్ నేనే వదులుకున్నా



ఇంటర్నెట్‌డెస్క్: ఒకానొక సమయంలో దక్షిణాదిలో స్టార్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకుని అనంతరం బాలీవుడ్‌లో పలు సినిమాల్లో యాక్ట్ చేశారు నటి ఇలియానా గత కొంతకాలంగా ఆమె సినిమాలకు దూరంగా ఉంటోన్న విషయం తెలిసిందే. తాజాగా ఆమె ఇన్‌స్టా వేదికగా అభిమానులతో ముచ్చటించారు. నెటిజన్లు అడిగిన పలు ప్రశ్నలకు బదులిచ్చారు. ఇందులో భాగంగా ఓ నెటిజన్.. ఆమె నటించిన ఓ హిట్ మూవీ సీక్వెల్ గురించి ప్రశ్నించాడు. దానిపై ఆమె స్పందించారు. సీక్వెల్‌లో నటించే అవకాశం తొలుత తనకే వచ్చిందని.. కాకపోతే తానే దానిని వదులుకోవాల్సి వచ్చిందని వెల్లడించారు.

"మేడమ్.. 'రైడ్ 2' సినిమాలో మీరెందుకు నటించలేదు? మీ కమ్‌బ్యాక్ ఎప్పుడు ఉంటుంది?" అని నెటిజన్ అడగ్గా.. "సినిమాలను నేనెంతో మిస్ అవుతున్నా. నాక్కూడా ఆ సినిమాలో భాగం కావాలనిపించింది. 'రైడ్' నాకెంతో ప్రత్యేకమైన చిత్రం. మాలిని పాత్రలో మరోసారి ఒదిగిపోవాలనుకున్నా. మా దర్శకుడు రాజ్‌కుమార్ గుప్తా, నటుడు అజయ్ దేవ్‌గణ్‌తో కలిసి వర్క్ చేయాలని నాక్కూడా ఉంది. నిజం చెప్పాలంటే, సీక్వెల్ తెరకెక్కించాలనుకున్నప్పుడు టీమ్ నన్ను సంప్రదించింది. మళ్లీ యాక్ట్ చేయమని అడిగింది. కాకపోతే, అదే సమయంలో నాకు బాబు పుట్టాడు. దానివల్ల నా ప్రాధాన్యతలు మారిపోయాయి. 'రైడ్ 2' ప్రమోషన్స్‌లో వాణి కపూర్ ఎంతో యాక్టివ్‌గా పాల్గొన్నారు. ఈ పాత్రకు ఆమె కూడా ప్రత్యేకతను తీసుకువచ్చే ఉంటుందని నమ్ముతున్నా" అని ఇలియానా చెప్పారు. "భవిష్యత్తులో సినిమాల్లోకి వచ్చే అవకాశం ఉందా?" అని మరో నెటిజన్ ప్రశ్నించగా.. తప్పకుండా వస్తానని బదులిచ్చారు. 2023లో మైఖేల్ డోలన్ అనే వ్యక్తితో ఇలియానా వివాహం జరిగింది. అదే ఏడాది ఒక బాబుకు ఆమె జన్మనిచ్చారు. "గర్భం ధరించాకా పనిచేయాలనుకున్నా.. కానీ ఈ సమయంలో తలెత్తిన కొన్ని ఆరోగ్య సమస్యల కారణంగా ఇంటికే పరిమితమవ్వాల్సి వచ్చింది. ఈ ప్రతికూల పరిస్థితుల్లో మా అమ్మ, నా భర్త మైఖేల్ నాకు అండగా నిలిచారు. ఈ సమస్యల నుంచి బయటపడే ధైర్యాన్ని నాలో నింపారు" అని గతంలో ఆమె ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. అజయ్ దేవ్‌గణ్ - ఇలియానా జంటగా నటించిన 'రైడ్' 2018లో విడుదలై విజయాన్ని అందుకుంది. దీనికి సీక్వెల్‌గా నిర్మించిన 'రైడ్ 2' మే ఆరంభంలో విడుదలైంది.

## ఒకే సినిమాకు రెండు క్లైమాక్స్‌లు.. 'హౌస్‌ఫుల్ 5' కొత్త ప్రయోగం!




బాలీవుడ్ కామెడీ ఫ్రాంచైజీ సిరీస్‌లో భాగంగా వస్తున్న 'హౌస్‌ఫుల్ 5' ఒక కొత్త ప్రయోగానికి సిద్ధమైంది. సాధారణంగా ఏ సినిమాకు అయిన ఒకే క్లైమాక్స్ ఉంటుందన్న విషయం తెలిసిందే. అయితే, ఈ సినిమా మాత్రం రెండు వేర్వేరు క్లైమాక్స్‌లతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. హౌస్‌ఫుల్ 5హౌస్‌ఫుల్ 5 అనే రెండు వెర్షన్లలో సినిమా విడుదల కానుంది. ఈ రెండు వెర్షన్లలో కేవలం క్లైమాక్స్‌లు మాత్రమే కాదు, 'కిల్లర్స్' (సినిమాలోని విలన్ పాత్రలు) కూడా భిన్నంగా ఉంటాయని తెలుస్తోంది. సాజిద్ నదియాద్‌వాలా నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ కామెడీ ఎంటర్‌టైనర్‌లో అక్షయ్ కుమార్, అభిషేక్ బచ్చన్, రితీష్ దేశ్‌ముఖ్, నానా పటేకర్ వంటి స్టార్ నటీనటులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే సినిమా నుండి విడుదలైన "ఫుగ్డీ డ్యాన్స్" వంటి పాటలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. జూన్ 6, 2025న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న 'హౌస్‌ఫుల్ 5' ఈ వినూత్న ప్రయోగంతో ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో వేచి చూడాలి.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.